'ముడా' డీ నోటిఫికేషన్‌లో అక్రమాలు
● సీఎంపై లోకాయుక్తకు బీజేపీ నేత రమేష్ ఫిర్యాదు 7
మైసూరు పోలీస్ స్టేషన్‌పై దాడి కేసు..
● రెచ్చగొట్టే ప్రసంగం చేసిన మౌల్వీ అరెస్టు

పాతిక శాతం బడులకు.. తాళం..!





● ప్రవేశాలు తక్కువ ఉన్న పాఠశాలల విలీనానికి ప్రభుత్వం సిద్ధం
● ప్రమాదంలో 6వేల స్కూళ్లు.. తొలిదశలో 8 జిల్లాల్లో..
● 50వేల మంది విద్యార్థుల భవిష్యత్తు అగమ్యగోచరం.. గ్రామాల్లో అధికం
● మండిపడుతున్న విద్యార్థి సంఘాలు, సామాజిక వేత్తలు

బెంగళూరు, ఫిబ్రవరి 20 (ఆంధ్రజ్యోతి): ప్రవేశాలు తక్కువగా ఉన్నాయని పాఠశాలల మూసివేతకు ప్రభుత్వం సిద్ధమయ్యింది. రాష్ట్ర వ్యాప్తంగా దాదాపు 25శాతం పాఠశాలలపై వేటు పడనుంది. అందరికీ కనీస చదువు ఉండాలనే లక్ష్యంతో నిర్బంధ విద్య అమలు చేస్తున్నా పూర్తి స్థాయిలో అమలు కాలేదని తెలుస్తోంది. రాష్ట్రవ్యాప్తంగా ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలకు దీటుగా ప్రైవేట్ పాఠశాలలు తలెత్తడం, కన్నడ మీడియం కంటే ఆంగ్ల మీడియానికి ప్రాధాన్యం ఇవ్వడంతో ప్రభుత్వ పాఠశాలల్లో రానురాను అడ్మిషన్ల సంఖ్య తగ్గుతోంది. ప్రభుత్వ పాఠశాలలు కొన్ని చోట్ల నెంబరువన్‌గా రాణిస్తుండగా మరికొన్ని చోట్ల మౌలిక సదుపాయాల కొరత కొట్టొచ్చినట్లు కనిపిస్తోంది. తగినన్ని తరగతి గదులు లేకపోవడం, ఒకవేళ ఉన్నా ఉపాధ్యాయుల కొరత, ఇతరత్రా సమస్యలు వంటి కారణాలతో ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలల్లో ప్రవేశాలు తగ్గుముఖం పడుతున్నాయి. కొన్ని చోట్ల విద్యార్థుల అడ్మిషన్లు పది అంకెకు మించడం లేదు. వరుసగా ఇదే పరిస్థితి కొనసాగితే ఆ పాఠశాలను సమీపంలోని మరో పాఠశాలకు విలీనం చేయాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఇలా రాష్ట్రవ్యాప్తంగా 6వేల పాఠశాలలకు ప్రమాదం పొంచి ఉన్నట్లు తెలుస్తోంది.

తొలిదశలో 8 జిల్లాల్లో..

తొలిదశలో 8 జిల్లాల్లో ప్రాథమిక పాఠశాలలను విలీనం చేసి మాదిరి పాఠశాల నిర్వహించాలనే ప్రక్రియకు శ్రీకారం చుట్టారు. ఇందులో విద్యాశాఖ మంత్రి సొంత జిల్లా శివమొగ్గ కూడా ఉంది. కారవార, శిరసి విద్యాజిల్లాలను ఎంపిక చేశారు. వీటిలో కొన్ని జిల్లాల్లో ఆదర్శ పాఠశాలలను గుర్తించి ప్రభుత్వానికి నివేదిక సమర్పించారు. మరికొన్ని జిల్లాల్లో ఇంకా ఎంపిక ప్రక్రియ సాగుతున్నట్లు సమాచారం. ముఖ్యంగా పల్లె బడులపై అధికంగా వేటు పడనుంది.

పది మందిలోపు విద్యార్థులుంటే..

రాష్ట్రంలో మొత్తం 23,436 ప్రాథమిక పాఠశాలలు ఉండగా కమిషన్ ప్రస్తావనతో ఒకవైపు పదిమందికంటే తక్కువ విద్యార్థులు ఉన్న పాఠశాలలు సుమారు 6వేలు పాఠశాలలు విలీనం అయ్యే అవకాశం ఉంది. రాష్ట్రవ్యాప్తంగా 7,821 ఏకోపాధ్యాయ పాఠశాలలు ఉండగా పలు చోట్ల మౌలిక సదుపాయాల కొరత, ఒకవేళ ఉపాధ్యాయుడు సెలవు పెడితే సదరు పాఠశాలకు సెలవు ప్రకటించే పరిస్థితి ఉంది. 2023లో 1,078 పాఠశాలల్లో కొత్త అడ్మిషన్లు జరగలేదు. ఈ పాఠశాలల్లో 1,572 మంది ఉపాధ్యాయులు ఉన్నారు.

గుణాత్మక విద్య అందించాలి..

తక్కువ ప్రవేశాలు ఉంటున్న పాఠశాలలను కేంద్రీకృతం చేసి ఒక మాదిరి పాఠశాలను ఏర్పాటు చేయాలి. చుట్టుపక్కల పాఠశాలల విద్యార్థులను ఆ పాఠశాలకు వచ్చేలా చేసి గుణాత్మక విద్యను అందించాలి. తద్వారా ఆర్థికభారం కూడా తగ్గడమే కాక విద్యార్థులకు మంచి విద్యసాధ్యమని కొందరు అధికారుల వాదనగా ఉంది. ఇవన్నీ చెప్పడానికి బాగానే ఉన్నా ఆచరణలో సాధ్యమని పాలనా సంస్కరణల కమిషన్ ప్రస్తుత అధ్యక్షుడు ఆర్‌వీ దేశ్‌పాండే అభిప్రాయపడ్డారు. పెరుగుతున్న పోటీ తరుణంలో విద్యార్థులకు పోటీ పరీక్షలకు అనుగుణంగా తయారు చేయాల్సిన అవసరం ఎంతైనా ఉంది ప్రైవేట్ పాఠశాలల్లో ప్రాథమిక స్థాయి నుంచే పోటీ పరీక్షల్లో ఢీ కొనేలా శిక్షణ ఇస్తున్నారు. కానీ ప్రభుత్వ పాఠశాలలో ఆ స్థాయి శిక్షణ లేదు.

పాతిక శాతం మూతబడేనా..?

కమిషన్ ప్రస్తావించినట్లుగా విలీనానికి పది మందికంటే అడ్మిషన్లు తక్కువగా ఉన్న 3,457 ప్రభుత్వ పాఠశాలలను గుర్తించారు. ఇటీవల తాజాగా విడుదలైన నివేదిక ప్రకారం రాష్ట్రంలో తక్కువ ప్రవేశాలు ఉన్న పాఠశాలల సంఖ్య 6వేలకు చేరింది. ఇలా పాఠశాలలన్నీ విలీనమైతే రాష్ట్రంలో సుమారు 25శాతం పాఠశాలలకు తాళం పడే అవకాశం ఉంది. దీని ద్వారా 50వేలమందికిపైగా విద్యార్థుల భవిష్యత్తు అగమ్యగోచరమం కానుంది. ముఖ్యంగా పేదలు చదివే ప్రభుత్వ పాఠశాలలే మూత బడనున్నాయి.

పాఠశాల కమిషన్ ప్రతిపాదన

పాఠశాలలో పదిమందికంటే తక్కువ విద్యార్థులు ఉంటే వారికి గుణాత్మక విద్య లభించడం లేదని, అందుకే సమీపంలోని పాఠశాలల్లో విలీనం చేయాలని పాఠశాల సంస్కరణల కమిషన్ గత ప్రభుత్వానికి ప్రస్తావన పంపింది. అప్పట్లో ఈ అంశంపై వ్యతిరేకత వ్యక్తమైంది. అలాగైతే వాహన వ్యవస్థ కల్పించడం ద్వారా దూరంలోని గ్రామీణ విద్యార్థులను పాఠశాలకు పంపుతామని రాష్ట్ర ప్రభుత్వం ప్రయోగాత్మకంగా చేపట్టదలిచింది. దీంతో వేలాది ప్రభుత్వ పాఠశాలలు మూతపడనున్నాయి.

వరుసగా మూడేళ్లు అడ్మిషన్లు లేకుంటే విలీనమే...

కమిషన్ ప్రతిపాదించిన ప్రకారం వరుసగా మూడేళ్లు కొత్త అడ్మిషన్లు లేకుంటే విలీనం చేసే అవకాశం ఉంది. ఒకసారి మూతపడితే మళ్లీ తెరుచుకున్న ఘటనలు అరుదు అనే చెప్పవచ్చు. విలీనం ప్రక్రియ వల్ల గ్రామీణ ప్రాంతాల్లో విద్యా వ్యవస్థకు భంగం కానుందని పలువురు విద్యానిపుణులు అభిప్రాయపడుతున్నారు. మరి రానున్న రోజుల్లో ఎలాంటి చర్యలు చేపడతారనేది వేచి చూడాలి. అయితే ప్రభుత్వ నిర్ణయంపై పలువురు ప్రజాసంఘాలు, విద్యావేత్తలు మండిపడుతున్నారు. ప్రవేశాల పేరుతో పాఠశాలలు మూసివేయడం తగదని, దీంతో పేదలు విద్యకు దూరమవుతారని మండిపడుతున్నారు.

ప్రతిభకు అవకాశాలు కల్పిస్తాం

● విదేశాలకు వలసలు వద్దు ● మంత్రి ప్రియాంక ఖర్గే

బెంగళూరు, ఫిబ్రవరి 20(ఆంధ్రజ్యోతి): ప్రతిభావంత విద్యార్థులు విదేశాలకు వెళ్లి పనిచేయడానికి బదులు స్థానికంగానే ఉంటూ దేశ ఆర్థికాభివృద్ధికి పాటు పడాలని, అవసరమైన అన్ని సౌకర్యాలను కల్పించేందుకు ప్రభుత్వం కట్టుబడి ఉందని ఐటీబీటీ శాఖలమంత్రి ప్రియాంక ఖర్గే పేర్కొన్నారు. నగరంలోని రామయ్య అప్లైడ్ సైన్సెస్ యూనివర్సిటీ, అసోసియేషన్ ఆఫ్ ఇండియన్ యూనివర్సిటీ సంయుక్తంగా బుధవారం 'అన్వేషణ' పేరిట ఏర్పాటు చేసిన దక్షిణ విభాగం విద్యార్థుల పరిశోధనా సమ్మేళనాన్ని ప్రారంభించి మాట్లాడారు. అమెరికాకు వెళ్లేందుకు 1.40 లక్షలమంది విద్యార్థులకు స్టూడెంట్ వీసా, 3.8 లక్షలమందికి ఉద్యోగ వీసా ఇచ్చామన్నారు. ప్రతిభావంత విద్యార్థులు ఇలా వలసబాట పట్టడం ద్వారా దేశ ఆర్థిక అభివృద్ధి కుంటుపడే ప్రమాదం ఉందని అభిప్రాయపడ్డారు. ప్రస్తుతం మనదేశంలో ఉద్యోగం లేదా కంపెనీ ప్రారంభించడం ఉత్తమమని అభిప్రాయపడ్డారు. ఇతర దేశాల కంపెనీలు తమ కేంద్ర కార్యాలయాలను మన రాష్ట్రంలో స్థాపిస్తున్నాయన్నారు. ఐటీబీటీ, ఈవీ, యానిమేషన్, సైబర్ సెక్యూరిటీ తదితర పాలసీలను తొలిసారిగా అమలు చేసిన ఘనత మన రాష్ట్రానికి ఉందన్నారు. ఇంతటి సాధనలు ఉన్నప్పటికీ కర్ణాటకలో నైపుణ్య కొరత వెంటాడుతోందని, విద్యార్థులు దేశవ్యాప్తంగా ఎదుర్కొంటున్న సమస్యలకు పరిష్కారం కల్పించాలి ఉందన్నారు. వైద్యవిద్యాశాఖ మంత్రి శరణ ప్రకాశ్‌పాటిల్ మాట్లాడుతూ ఇతర రాష్ట్రాలతో పోలిస్తే కర్ణాటకలో విద్యాసంస్థలు అధికమన్నారు. గుణాత్మకను విద్యను అందిస్తున్నాయని, ఎన్నో కార్యక్రమాలను ప్రయోగాత్మకంగా అమలు చేసి ప్రోత్సహిస్తున్నాయన్నారు. అంతేకాకుండా విద్యార్థులలోని ప్రతిభను ప్రోత్సహించేందుకు పలు వేదికలు కల్పిస్తున్నారన్నారు. భవిష్యత్తులో కృత్రిమ మేథ మరింత ప్రాముఖ్యత వహించనుందన్నారు. విద్యార్థులు పోటీ ప్రపంచంలో ఇందుకు అనుగుణంగా ముందుకు సాగాలని అభిప్రాయపడ్డారు. కార్యక్రమంలో కర్ణాటక, తమిళనాడు, ఆంధ్రప్రదేశ్, కేరళ, తెలంగాణ రాష్ట్రాలకు చెందిన 750మంది విద్యార్థులు నమోదు చేసుకోగా 169మంది వివిధ రకాల ప్రాజెక్టులను ప్రదర్శించారు. గోకుల ఎడ్యుకేషన్ ఫౌండేషన్ ముఖ్య కార్యనిర్వాహకులు ఎంఆర్ శ్రీనివాసమూర్తి మాట్లాడుతూ తమ యూనివర్సిటీలో విద్యార్థుల డిమాండ్‌కు అనుగుణమైన పలు కోర్సులు ఉన్నాయని, గుణాత్మక విద్యను అందిస్తున్నామని అందుకే ఎక్కువసంఖ్యలో అడ్మిషన్లు సాధ్యమవుతున్నాయన్నారు. రామయ్య అప్లైడ్ సైన్సెస్ యూనివర్సిటీ కులపతి ప్రొఫెసర్ కులదీప్‌కుమార్ రైనా మాట్లాడుతూ విద్యార్థుల సౌలభ్యం కోసం సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్ అందుబాటులోకి తెచ్చామన్నారు. ఇక్కడ విద్యార్థులు ప్రయోగాత్మకంగా తర్ఫీదు పొందవచ్చునన్నారు. భవిష్యత్తులు విద్యార్థులు ఉద్యోగులు కావడానికి బదులు మీరే ఉద్యోగం ఇచ్చేంతగా ఎదగవచ్చునని, సొంత పరిశ్రమలు, లేదా సంస్థలు స్థాపించేందుకు దోహదం కానుందని అభిప్రాయపడ్డారు. కార్యక్రమంలో ప్రొఫెసర్ గోవింద ఆర్ కడంబి, డాక్టర్ బీఎం కిరణ్‌కుమార్, విద్యానిపుణుడు అమరేంద్ర పాణి, డాక్టర్ నాగేంద్రప్రతాప్‌సింగ్ పాల్గొన్నారు.



వేదికపై మంత్రులు ప్రియాంక ఖర్గే, శరణప్రకాశ్ పాటిల్ తదితరులు

బంగారప్ప ఇంట్లో రెబెల్స్ భేటీ

బెంగళూరు, ఫిబ్రవరి 20(ఆంధ్రజ్యోతి): బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు విజయేంద్రకు వ్యతిరేక కూటమిగా మారిన వారంతా గురువారం భేటీ అయ్యారు. పార్టీ సీనియర్‌నేత కుమార బంగారప్ప ఇంట్లో అందరూ కలిశారు. ఇటీవల రెబల్ నేత బసనగౌడపాటిల్ యత్నాళ్‌కు పార్టీ కేంద్ర క్రమశిక్షణా కమిటీ నోటీసులు జారీ చేసిన తర్వాత భేటీ కావడం ప్రాధాన్యం సంతరించుకుంది. యత్నాళ్ ఇప్పటికే అధిష్టానానికి సుదీర్ఘ వివరణ ఇచ్చారు. ఇదే సందర్భంగా యత్నాళ్ మీడియాతో మాట్లాడుతూ షోకాజ్ నోటీసులు తనకే అందకుండానే విజయేంద్ర మీడియాకు తెలిపారంటే ఇదంతా అతడి కుట్ర అనేది తేలిందన్నారు. ఇటువంటి నీచమైన ప్రక్రియలు తాను చేయలేనన్నారు. నోటీసులు ఇచ్చారు వివరణ పంపాను కానీ ఏం జరుగనుందో చూద్దాం అన్నారు. భేటీలో రమేష్ జార్కిహోళి, అరవిందలింబావళి, కేంద్ర మాజీ మంత్రి జీఎం సిద్దేశ్వర్, హాళళ్కెర చంద్రప్ప తదితరులు పాల్గొన్నారు.

కాదన్నందుకే కడతేర్చాడు..!

● ప్రేమ నిరాకరించినందుకే హైస్కూల్ టీచర్ హత్య
● ఆ తర్వాత ఉరివేసుకుని ఆత్మహత్య
● చిక్కమగళూరు జిల్లా ఘటనపై పోలీసులు



మధు(ఫైల్) పూర్ణిమ (ఫైల్)

బెంగళూరు, ఫిబ్రవరి 20 (ఆంధ్రజ్యోతి): చిక్కమగళూరు తాలూకా దాసరహళ్ళిలో ఇద్దరి మృతికి సంబంధించి పోలీసులు వాస్తవాలను వెలికి తీశారు. హైస్కూల్ టీచర్‌ను హత్య చేసిన యువకుడు ఆత్మహత్యకు పాల్పడినట్లుగా తేల్చారు. గురువారం పోలీసులు తెలిపిన వివరాల మేరకు శివమొగ్గ జిల్లా భద్రావతికి చెందిన మధు(28) బెంగళూరులో స్థిర పడ్డారు. మాగడిలోని ఓ హైస్కూల్‌లో టీచర్‌గా పనిచేసే పూర్ణిమ(25) పక్కపక్కన ఇళ్లలోనే నివసించేవారు. రెండు కుటుంబాలు కలిసిమెలిసి ఉండేవి. మధు కారు డ్రైవర్‌గా పనిచేసేవాడు. ఇద్దరి ఇళ్లలో ఎటువంటి కార్యక్రమాలు జరిగినా కలిసి పాల్గొనేవారు. ఎనిమిది నెలల కిందట పూర్ణిమ చెల్లెలి పెళ్లికాగా మధు క్రియాశీలకంగా పనిచేశాడు. ఇతడి కారునే అద్దెకు వాడుకున్నారు. ఇటీవల పూర్ణిమను ప్రేమిస్తున్నట్లు మధు చెప్పగా అందుకు నిరాకరించినట్లు తెలుస్తోంది. గతవారం పాఠశాల ముగించుకుని ఇంటికి వెళుతున్న పూర్ణిమను గుర్తించిన మధు కారులో డ్రాప్ చేస్తానంటూ నమ్మబలికాడు. పాఠశాల నుంచి పూర్ణిమ ఇంటికి 20 కిలోమీటర్ల దూరంకాగా ఏకంగా చిక్కమగళూరుకు తీసుకెళ్లాడు. యువతిని కారులోనే గొంతునులిమి హత్యచేశాడు. అందుకు సంబంధించిన ఆధారాలు పోలీసులు గుర్తించారు. కారును అక్కడే వదిలేసి సమీపంలోని ఓ చెట్టుకు ఆమెకు చెందిన చున్నీతో ఉరివేసుకుని యువకుడు ఆత్మహత్యకు పాల్పడినట్లు చిక్కమగళూరు గ్రామీణ పోలీసులు తెలిపారు. ప్రాథమికంగా ప్రేమను కాదన్నందుకే పూర్ణిమను హత్య చేసి మధు ఆత్మహత్యకు పాల్పడినట్లు పోలీసులు ప్రకటించారు.

కారును ఢీకొన్న లారీ

● ముగ్గురి దుర్మరణం ● ఓవర్‌టేక్ చేస్తుండగా ప్రమాదం

బెంగళూరు, ఫిబ్రవరి 20(ఆంధ్రజ్యోతి): లారీని ఓవర్‌టేక్ చేయబోతూ కారులో ప్రయాణిస్తున్న ముగ్గురు దుర్మరణం చెందారు. ఉత్తరకన్నడ జిల్లా యల్లాపుర పరిధిలో ఈ ప్రమాదం చోటు చేసుకుంది. కొప్పళ జిల్లా పడకి గ్రామానికి చెందిన కుటుంబం అంకోలా వైపు విహార యాత్రకు వెళుతుండగా బుధవారం ప్రమాదం జరిగింది. లారీ ఓవర్‌టేక్ చేసే సమయంలోనే ఎదురుగా వస్తున్న కారును ఢీకొంది. ప్రమాదంలో వెంకటేష్‌రెడ్డి (37), భార్య చైత్రా(32)తో పాటు ఏడునెలల శ్రీహాన్ మృతి చెందారు. తల్లికొడుకులు అక్కడికక్కడే దుర్మరణం చెందగా వెంకటేష్‌రెడ్డి ఆసుపత్రిలో చికిత్స పొందుతూ కన్నుమూశారు. కాగా వాహనం నడుపుతున్న వెంకటేష్‌రెడ్డి సోదరుడు శ్రీకాంత్‌రెడ్డికి రెండుకాళ్ళు విరిగాయి. యల్లాపుర తాలూకా అరబైల్ గుట్టప్రాంతంలో జాతీయ రహదారిపై ప్రమాదం జరిగింది.

సొంత వాహనాలపైనే.. మోజు..!

● మూడింతలు పెరిగిన వాహనాల రిజిస్ట్రేషన్
● బెంగళూరు ట్రాఫిక్‌పై పెనుప్రభావం



హెబ్బాళ ప్రాంతంలో ట్రాఫిక్ జామ్ (ఫైల్)

బెంగళూరు, ఫిబ్రవరి 20 (ఆంధ్రజ్యోతి): సొంత వాహనంలో హల్‌చల్ అంటూ తిరిగేందుకు ఐటీ నగరవాసులు ఆసక్తి చూపుతున్నారు. ఇటీవల కాలంలో 20ఏళ్లు దాటినయువతీ యువకులు సొంత వాహనంపైనే ప్రయాణించేందుకు ఇష్టం చూపుతున్నారు. ద్విచక్రవాహనం ఒక్కటే కాకుండా కారు తప్పనిసరి అనేలా ఆలోచిస్తున్నారు. ఈ ప్రభావం బెంగళూరులో ట్రాఫిక్‌పై తీవ్ర ప్రభావం చూపుతోంది.

● రాష్ట్రవ్యాప్తంగా ప్రజారవాణ కంటే సొంతవాహనాలు కల్గినవారి సంఖ్య అమాంతంగా పెరుగుతోంది. వాహనాల కొనుగోలుకు తగిన సౌలభ్యాలు, రుణ సదుపాయం ఉండడంతో కొత్త వాహనాలు దక్కించుకునేందుకు ప్రజలు ఇష్టపడుతున్నారు. దశాబ్దక్రితంతో పోలిస్తే కొత్త వాహనాల రిజిస్ట్రేషన్ అమాంతంగా పెరుగుతోంది. బ్యాంకులు వాహనాలకు సరళీకృతంగా రుణాలు ఇస్తున్నాయి. ఆదాయం పెరగడంతో కొత్త కార్లను కొంటున్నారు. మార్కెట్‌లోకి వచ్చే కొత్తకార్లు దక్షిణాదిన కర్ణాటకలో ఆశాజనకంగా విక్రయాలు అవుతున్నట్లు తెలుస్తోంది. ప్రస్తుతం సమగ్రంగా ఆదాయం కల్గినవారు ఇంటికి ఒకటిరెండు ద్విచక్రవాహనాలు, వాటిలో ఒకటి మోపెడ్‌లాంటిది, మరో వాహనం బుల్లెట్‌తోపాటు సమీప ప్రాంతాల్లో తిరిగేందుకు ఒక కారు, సుదూర ప్రాంతాలకు వెళ్లేందుకు మరో కారు అనేలా మారుతున్నారు.

● రాష్ట్రంలో 2014-15లో 1.79 కోట్ల వాహనాలు ఉండేవి. 2025 జనవరి నాటికి ఆ సంఖ్య 3.26 కోట్లకు పెరిగింది. కొత్త వాహనాల ఖరీదులో 120శాతం పెరిగినట్టు అయ్యింది. రిజిస్ట్రేషన్ల ప్రకారం ద్విచక్రవాహనాలే అత్యధికంగా ఉన్నాయి. ఆ తర్వాతిస్థానంలో కారు, ఆ తర్వాత ఆటోలు ఉన్నాయని రవాణాశాఖ ద్వారా తెలుస్తోంది.

● రవాణాశాఖకు ఆదాయం

రాష్ట్ర ఖజానాకు ఎక్కువ ఆదాయం తీసుకొచ్చే విభాగాలలో వాహనాల రిజిస్ట్రేషన్ కూడా ఉంది. వాహనాల కొనుగోళ్లు పెరగడంతో రవాణాశాఖకు రిజిస్ట్రేషన్‌ల రూపంలో ఆదాయం పెరుగుతోంది. వాహనాలసంఖ్య పెరుగుతుండడంతో ఒకప్పుడు బెంగళూరులో మాత్రమే ట్రాఫిక్ అనే పరిస్థితి ఉండేది. ప్రస్తుతం మైసూరు, మంగళూరు, ఉడుపి, బెళగావితో పాటు పలు జిల్లా కేంద్రాలలోనూ ట్రాఫిక్ సమస్యలు తలెత్తుతున్నాయి.

గడిచిన దశాబ్దంతో పోలిస్తే రాష్ట్రంలోని ఇతర ప్రాంతాలకంటే రాజధాని బెంగళూరులో వాహనాల కొనుగోళ్లు మూడింతలు వేగంగా పెరిగాయి. బెంగళూరులో వాహనాల సంఖ్య గణనీయంగా పెరిగింది. రాష్ట్రంలోని ఇతర ప్రాంతాల్లో వాహనాలసంఖ్య 2014-15 నాటికి 1.79 కోట్లు ఉండగా 2025 జనవరి నాటికి 2.08కోట్లకు పెరిగింది. 2014-15లో బెంగళూరులో 65.75 లక్షల వాహనాలు ఉండేవి. 2025 జనవరి ఆఖరు నాటికి 1.21 కోట్ల వాహనాలు చేరాయి. బెంగళూరులో ప్రతి వ్యక్తికి సరాసరిన ఒక వాహనం ఉన్నట్టు అవుతోంది. రాష్ట్రంలోని ఇతర ప్రాంతాల్లో ప్రతి ముగ్గురిలో ఒకరికి వాహనం ఉన్నట్టు అయ్యింది.

● పెరిగిన వాహనాలు

బెంగళూరు జనాభాతో పోలిస్తే ఇప్పటికే వాహనాలసంఖ్య ఎక్కువ అయ్యింది. బెంగళూరులో 1.21 కోట్ల వాహనాలు ఉండగా రాష్ట్రవ్యాప్తంగా బెంగళూరు మినహా 5.70 కోట్ల మంది జనాభాకు 2.08 కోట్ల వాహనాలు ఉన్నాయి. బెంగళూరులో నిత్యం 6వేల వాహనాలు రిజిస్ట్రేషన్ అవుతున్నాయంటే మరో రెండు మూడేళ్లలో వాహనాల సంఖ్య ఏ స్థాయికి చేరుతాయనేది అంచనా వేయడం కష్టం అవుతోంది. ఇప్పటికే బెంగళూరులో కీలకమైన సమయాల్లో కిలోమీటరు ప్రయాణానికి 18 నిమిషాలపైన పడుతోంది. నగరంలో ప్రధానమైనది ట్రాఫిక్ సమస్యగా దశాబ్దకాలంగా కొనసాగుతోంది. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు నగరంలో ట్రాఫిక్ సమస్యను పరిష్కరించేందుకు ఎన్నో ప్రజా రవాణా వ్యవస్థలు అందుబాటులోకి తెస్తున్నాయి. అయినా ట్రాఫిక్‌లో మాత్రం వ్యత్యాసం లేదనిపిస్తోంది.

● కారణం ఇదీ..

రాష్ట్రంలో ప్రజల ఆర్థిక వనరుల పెరగడం, జీవన విధానం మెరుగు కావడంతో తదుపరి ఆసక్తి, అవసరమైన వాహన కొనుగోలువైపు దృష్టి సారిస్తున్నారు. అందుకే వాహనాల కొనుగోలు ప్రమాణం గణనీయంగా పెరుగుతోంది. గడిచిన దశాబ్దంలో వాహనాల రిజిస్ట్రేషన్ 120 శాతం పెరిగినట్టు రవాణాశాఖ అధికారులు తెల్పుతున్నారు. బెంగళూరులో వాహనాలసంఖ్య పెరిగేందుకు ఆదాయంతోపాటు మౌలిక సదుపాయాల అభివృద్ధి కూడా కారణంగా ఉంది. ద్విచక్రవాహనంతోపాటు కారు కలిగి ఉండడం ప్రస్తుతం సాధారణమైన అంశంగా మారిపోతోంది. రానున్న ఐదేళ్లలో వాహనాల కొనుగోళ్లు మరింత పెరిగే అవకాశం ఉందని రవాణాశాఖ నిపుణులు చెబుతున్నారు.

● సాంకేతిక విధానాలు... కొత్త ప్రాజెక్టులు

బెంగళూరులో ట్రాఫిక్ క్రమబద్ధీకరణకు నగర ట్రాఫిక్ పోలీసులు సాంకేతిక విధానాలను సరళీకృతం చేస్తున్నారు. కొన్నేళ్లకాలంగా దేశంలోని ఇతర ప్రాంతాలతో పోలిస్తే బెంగళూరు ట్రాఫిక్ విభాగం సాంకేతికతను అమలు చేస్తోంది. తాజాగా అస్త్రం యాప్‌ను అందుబాటులోకి తెచ్చింది. కేవలం మొబైల్‌లో ఈ యాప్ ఇన్‌స్టాల్ చేసుకుంటే ప్రతిరోజూ ఆఫీసుకు వెళ్లేమార్గంలో ట్రాఫిక్ రద్దీని ముందుగా తెలుసుకునేందుకు వీలుంది. ఆఫీసు కాకుండా ఇతర మార్గాలలో సురక్షితంగా వెళ్లేందుకు ముందుగా అంచనా వేసుకోవచ్చు. ఇక ఫైన్‌లతోపాటు అన్ని విషయాలు తెలుసుకోవచ్చు. ప్రభుత్వం కూడా ట్రాఫిక్‌ను కట్టడి చేయాలని ఎన్నో కసరత్తులు చేస్తోంది. మెట్రో మార్గాలను విస్తరించడంతోపాటు సబర్బన్ రైలు ప్రాజెక్టును తీసుకొచ్చే ప్రయత్నం చేస్తోంది. ఇక తొలిసారిగా బెంగళూరులో సొరంగ మార్గం నిర్మించేందుకు సిద్ధమైంది.



పాత మద్రాస్ రోడ్డులో ట్రాఫిక్ (ఫైల్)

చూడాలంటే భయపడాలి..!



విద్యార్థులతో ప్రతిజ్ఞ చేయిస్తున్న ఎమ్మెల్యే పరిటాల సునీత, ఎస్పీ రత్న, అసిస్టెంట్ కలెక్టర్ వినూత్న తదితరులు



నారీ శక్తిని తెలిపే నృత్య ప్రదర్శన

బాలికల జోలికొస్తే ఎన్‌కౌంటర్ చేయండి

పోలీసులకు ఎమ్మెల్యే పరిటాల సునీత వినతి

'ఆద్య' పేరిట పోలీసు శాఖ వినూత్న కార్యక్రమం

తొలిసారిగా నసనకోట ఎంజేపీ పాఠశాలలో నిర్వహణ



రామగిరి, ఫిబ్రవరి 20(ఆంధ్రజ్యోతి): బాలికల వైపు కన్నెత్తి చూడాలంటే కీచకులు భయపడేలా పోలీసులు చర్యలు తీసుకోవాలని ఎమ్మెల్యే పరిటాల సునీత సూచించారు. సమాజంలో జరిగే పరిణామాలను తెలియజేసి. బాలికలను చైతన్యపరిచేందుకు శ్రీసత్యసాయి జిల్లా పోలీసులు 'ఆద్య' పేరిట తొలిసారి నిర్వహించిన కార్యక్రమంలో ఆమె పాల్గొని ప్రసంగించారు. నసనకోటలోని ఎంజేపీ బాలికల పాఠశాలలో ఎస్‌ఐ సుధాకర్ యాదవ్ అధ్యక్షతన గురువారం ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. బాలికలను వేధించేవారిని పోలీసులు ఎన్‌కౌంటర్ చేయాలని ఎమ్మెల్యే అన్నారు. చిన్న వయసులో ప్రేమ, ఇతర వాటికి ఆకర్షితులు కావద్దని సూచించారు. తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు అనుక్షణం పిల్లల విషయంలో అప్రమత్తంగా ఉండాలని అన్నారు. విద్యాభివృద్ధి కోసం తాను, తన భర్త పరిటాల రవీంద్ర ఎంతో కృషిచేశామని అన్నారు. బాలికల విద్యాభివృద్ధికి శక్తి వంచన లేకుండా కృషి చేస్తామని అన్నారు. 'ఆద్య అంటే పవర్, సాటిలేని వ్యక్తి' అని అన్నారు. మహిళలు, బాలికలు ధైర్యంగా ముందుకు సాగాలని అన్నారు. భర్తను కోల్పోయి, కష్టకాలంలో రాజకీయాల్లోకి వచ్చానని, శవాలను దాటుకుని నామినేషన్ వేసిన రోజులు ఉన్నాయని గుర్తుచేసుకున్నారు. ఆ తరువాత రాజకీయాల్లో రాణిస్తున్నానని అన్నారు. తనలాగే ప్రతి మహిళ ధైర్యంగా అడుగులు వేయాలని అన్నారు. తల్లిదండ్రుల సహకారంతో రాణించిన అసిస్టెంట్ కలెక్టర్ వినూత్న, ఎస్పీ రత్నను స్ఫూర్తిగా తీసుకోవాలని సూచించారు. ఎంతో మంది రైతులు పంటలు సరిగా పండకపోయినా, తిన్నాతినకపోయినా బిడ్డల చదువుకోసం డబ్బులు ఖర్చు చేస్తున్నారని, వారి ఆశలను వమ్ము చేయవద్దని సూచించారు.

అరచేతిలో అద్భుతం: ఎస్పీ రత్న



సెల్‌ఫోన్ అరచేతిలో అద్భుతమని.. అది శాపంగా మారకుండా చూసుకోవాలని ఎస్పీ రత్న సూచించారు. టెక్నాలజీని మంచి కోసం ఉపయోగించాలని అన్నారు. బాలికల రక్షణ కోసం పోలీసులు అన్ని చర్యలు తీసుకుంటున్నారని, సైబర్ క్రైం, డ్రగ్స్ వంటి వాటికి దూరంగా ఉండాలని సూచించారు. ఎవరైన తప్పుదోవ పట్టించాలని చూస్తే ధైర్యంగా పోలీసులకు సమాచారం ఇవ్వాలని అన్నారు. ఫిర్యాదు చేయాల్సిన నంబర్లను బాలికల చేత చెప్పించారు. 8వ తరగతి నుంచి ఇంటర్ వరకు చదివే వారికి లోకంలో ఏది చూసినా అందంగా కనిపిస్తుందని, ఆ సమయంలోనే ఏది మంచి ఏది చెడు అన్నది తెలుసుకోవాలని హితవు పలికారు. 'మీ జీవితాన్ని.. మీ శరీరాన్ని పరాయి వ్యక్తుల పాలు చేయవద్దు. సోషియల్ మీడియాలోకి ప్రవేశించి మీ జీవితాన్ని పక్కదారి పట్టించుకోవద్దు' అని సూచించారు.

నమ్మకాన్ని వమ్ము చేయొద్దు - అసిస్టెంట్ కలెక్టర్ వినూత్న



తల్లిదండ్రులు ఎంతో నమ్మకంతో అమ్మాయిలను చదివిస్తుంటారని, వారి నమ్మకాన్ని వమ్ముచేయకుండా బాగా చదువుకోవాలని అసిస్టెంట్ కలెక్టర్ వినూత్న సూచించారు. ఒక్కరు తప్పు చేసినా ఆ ప్రభావం మొత్తం పాఠశాల, గ్రామం మీద పడుతుందని హెచ్చరించారు. 'మా ఇంట్లో ఇద్దరు ఆడపిల్లలం ఉన్నాం. త్వరగా పెళ్లి చేయాలని మా తల్లిదండ్రులపై ఒత్తిడి ఉండేది. కానీ వారు నాపై నమ్మకంతో సివిల్స్ కోసం ఢిల్లీకి పంపించారు. నేను నాలుగుసార్లు వరుసగా విఫలమయ్యాను. నాపై నాకు నమ్మకంలేని సమయంలో నా తల్లిదండ్రులు వెన్నుతట్టి ప్రోత్సహించారు. చివరికి ఐదవ సారి సివిల్స్‌లో ర్యాంకు సాధించాను. ఐపీఎస్‌గా మీ ముందుకు వచ్చాను' అని వివరించారు. పాఠశాల బాత్‌రూంలోలలో బాలికలు ప్రసవిస్తున్నారు. ఈ సంఘటనలు నన్ను కలచి వేస్తున్నాయి అని ఆవేదన వ్యక్తం చేశారు.

ఆడబిడ్డలకు రక్షణ: శైలజ, న్యాయవాది

ఇటీవల బాలికలు, మహిళలపై లైంగిక దాడులు, వేధింపులు ఎక్కువయ్యాయని ప్రముఖ న్యాయవాది పరిటాల శైలజ అన్నారు. వీటి నియంత్రణకు ఓ వైపు పోలీసుశాఖ పని చేస్తోందని, అదే సమయంలో న్యాయపరంగా తాము అందుబాటులో ఉంటామని అన్నారు. పాఠశాలస్థాయి నుంచి అనేక అంశాలపై అవగాహన కల్పించాలని ఉపాధ్యాయులకు సూచించారు. ఆద్యలాంటి కార్యక్రమాలు బాలికల భవిష్యత్తుకు ఎంతగానో ఉపయోగపడతాయని అభినందించారు. ఆద్య కార్యక్రమంలో బాలికల నృత్య ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో డీఎంహెచ్ఓ ఫైరోజ్ బేగం, ధర్మవరం డీఎస్పీ హేమంత్ కుమార్, టీడీపీ నాయకులు ఎల్.నారాయణచౌదరి, రామ్మూర్తినాయుడు సర్పంచ్ లలితమ, ఎంపీటీసీ శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.



రుద్రాభిషేకం చేస్తున్న పండితులు

ఓం నమఃశివాయ

ఏడోరోజూ కొనసాగిన యజ్ఞం... శివుడికి అభిషేకాలు

పుట్టపర్తి, ఫిబ్రవరి 20(ఆంధ్రజ్యోతి): శివనామస్మరణతో ప్రశాంతి నిలయంలోని సాయికుల్వంత్ హాల్ మార్మోగింది. విశ్వశాంతి, లోకసంరక్షణ కోసం చేపట్టిన అతిరుద్ర మహాయజ్ఞం ఏడోరోజు గురువారం కూడా కొనసాగింది. సాయికుల్వంత్‌లో వందల మంది పండితులు, యజ్ఞాన్ని కొనసాగించారు. ఉదయం 8 నుంచి 10.30 గంటల వరకు యజ్ఞం కొనసాగింది. శివలింగానికి వేదపండితులు పంచామృతంతో అభిషేకాలు నిర్వహించారు. గణపతి పూజతో యజ్ఞాన్ని మొదలుపెట్టి సర్వదేవతా అర్చనతో కొనసాగించారు. అతిరుద్ర మహాయజ్ఞాన్ని తిలకించడానికి వివిధ ప్రాంతాల నుంచి వేలాదిమంది భక్తులు తరలివచ్చారు. సాయంత్రం సాయికుల్వంత్‌లో నవీన్, ప్రతీక్ బృందం సంగీత కచేరి నిర్వహించారు. అనంతరం సత్యసాయి మహాసమాధిని దర్శించుకున్నారు.

రిజర్వేషన్ ఉద్యోగులపై మంత్రి లోకేశ్‌కు మక్కువ

● ఆర్‌ఈఎఫ్ నాయకులు ● వీసీకి గజమాలతో సత్కారం



వీసీ సుదర్శనరావును గజమాలతో సత్కరిస్తున్న ఆర్‌ఈఎఫ్ నాయకులు

అనంతపురం సెంట్రల్, ఫిబ్రవరి 20(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వంలోని రిజర్వేషన్ వర్గాల ఉద్యోగులంటే విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్‌కు మక్కువని ఆర్‌ఈఎఫ్ నాయకులు అన్నారు. జేఎన్‌టీయూ వీసీగా బాధ్యతలు చేపట్టిన ప్రొఫెసర్ సుదర్శనరావును గురువారం వారు గజమాలతో సత్కరించారు. అనంతరం వారు మాట్లాడుతూ గత ప్రభుత్వంలో రిజర్వేషన్ వర్గాలపట్ల అమానవీయంగా వ్యవహరించారన్నారు. నామినేటెడ్, కీలక పదవులకు అర్హత, అనుభవమున్నా నియమించలేదన్నారు. విశ్వవిద్యాలయాల్లో రాజకీయాన్ని చొప్పించి వైసీపీ వారికే పదవులు కట్టబెట్టేవారన్నారు. కూటమి ప్రభుత్వంలో రిజర్వేషన్ వర్గాల ఉద్యోగులకు సముచిత స్థానం కల్పిస్తుండటం అభినందనీయమన్నారు. ప్రొఫెసర్ సుదర్శనరావును వీసీగా నియమించడం ఇందుకు నిదర్శమన్నారు. రాష్ట్ర అధ్యక్షులు డాక్టర్ రామచంద్ర, వర్కింగ్ ప్రెసిడెంట్ డాక్టర్ ఎంటీ నాగభూషణం, నాయకులు రామకృష్ణ, రాజ్‌కుమార్, వెంకటనారాయణ, కుల్లాయప్ప, ఉమాశంకర్ తదితరులు వీసీని కలిసిన వారిలో ఉన్నారు.

ఉత్సాహంగా రాతిదూలం లాగుడు పోటీలు



పోటీలను ప్రారంభిస్తున్న అర్చకుడు రామాంజనేయులు

గుంతకల్లుటౌన్, ఫిబ్రవరి 20(ఆంధ్రజ్యోతి): మండలంలోని వెంకటాంపల్లి గ్రామంలో పెద్దకదిరప్ప స్వామి రథత్సోవం సందర్భంగా గురువారం రాతి దూలం లాగుడు పోటీలను ఉత్సాహంగా నిర్వహించారు. ఇందులో 9జతల వృషభాలు పాల్గొన్నాయి. అనంతపురం రూరల్ మండలం అక్కంపల్లికి చెందిన ఇంద్రారెడ్డి వృషభాలు 5,439అడుగులు లాగి మొదటి బహుమతి కింద రూ. 40వేలు సాధించాయి. తాడిపత్రికి చెందిన శేఖర్‌రెడ్డి వృషభాలు 5,400అడుగులు లాగి రెండో బహుమతి కింద రూ.30వేలు, పెద్దవడుగూరు మండలం లక్ష్మంపల్లికి చెందిన శివారెడ్డి వృషభాలు 4,882 అడుగులు లాగి మూడో బహుమతి కింద రూ.20వేలు, నంద్యాల జిల్లా ప్యాపిలి రంగాపురంకు చెందిన రామకృష్ణారెడ్డికి చెందిన వృషభాలు 4,846 అడుగులు లాగి నాలుగో బహుమతి కింద రూ.15వేలు సాధించాయి. కార్యక్రమంలో ఆలయ అర్చకుడు రామాంజనేయులు, భక్తులు పాల్గొన్నారు.

జర్నలిస్టుల సంక్షేమానికి కృషి

● ప్రభుత్వ విప్ కాలవ శ్రీనివాసులు



డైరీని ఆవిష్కరిస్తున్న కాలవ శ్రీనివాసులు, సంఘం నాయకులు

అనంతపురం అర్బన్, ఫిబ్రవరి 20(ఆంధ్రజ్యోతి): జర్నలిస్టుల సంక్షేమానికి కూటమి ప్రభుత్వం కృషి చేయడం జరుగుతుందని ప్రభుత్వ విప్ కాలవ శ్రీనివాసులు పేర్కొన్నారు. గురువారం స్థానిక అనంతపురం నగరంలోని ఆయన నివాసంలో ఏపీయూడబ్ల్యూజే-2025 డైరీని ఆయన ఆవిష్కరించారు. కార్యక్రమంలో ఏపీయూడబ్ల్యూజే జిల్లా అధ్యక్షుడు పయ్యావుల ప్రవీణ్, ప్రధాన కార్యదర్శి షేక్ మహ్మద్ అయూబ్, రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు కేపీ కుమార్, చలపతి, జిల్లా గౌరవ అధ్యక్షుడు భోగేశ్వరరెడ్డి, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు జయరాం పాల్గొన్నారు. ఈ సందర్భంగా జర్నలిస్టుల సమస్యలను సంఘం నాయకులు ఆయన దృష్టికి తీసుకువెళ్లారు. జర్నలిస్టుల సమస్యలను సీఎం చంద్రబాబు దృష్టికి తీసుకువెళ్లి పరిష్కరించేలా చొరవ చూపుతానని ఆయన హామీ ఇచ్చారు.

బీసీ రమేష్ గౌడ్‌కు అంతర్జాతీయ అవార్డు



అవార్డు అందుకుంటున్న రమేష్‌గౌడ్

అనంతపురం ప్రెస్‌క్లబ్, ఫిబ్రవరి 20 (ఆంధ్రజ్యోతి): జిల్లాకు చెందిన బీసీ సంఘం రాష్ట్ర నాయకుడు బీసీ రమేష్ గౌడ్ అంతర్జాతీయ అవార్డు అందుకున్నారు. ఈ మేరకు 19వ తేదీన దుబాయ్‌లోని దిపాం జుమేరియాలో నిర్వహించిన ప్రపంచ ప్రఖ్యాతి చెందిన వరల్డ్ బుక్ ఆఫ్ రికార్డ్స్ లండన్ ఇంటర్నేషనల్ ఎక్సలెన్సీ అవార్డును అందుకున్నారు. వివిధ రంగాల్లో విశిష్ట సేవలందించిన పలువురు ప్రముఖులను ఎంపిక చేయగా, అందులో జిల్లా నుంచి బీసీ రమేష్‌గౌడ్‌ను ఎంపిక చేసి అవార్డును అందజేశారు.

వైసీపీ నాయకుడి భూకబ్జా

భారీ బందోబస్తు మధ్య హక్కుదారులకు స్వాధీనం

శెట్టిపల్లిలో హైటెన్షన్

రెవెన్యూ అధికారులతో కబ్జాదారుల వాగ్వాదం



పత్రాలు చూపుతున్న కరణం వెంకోబరావు మనవళ్లు

పెనుకొండ రూరల్, ఫిబ్రవరి 20(ఆంధ్రజ్యోతి): వైసీపీ పాలనలో శోత్రియం భూమిని నకిలీ పత్రాలు సృష్టించి రిజిస్ట్రేషన్ చేయించుకున్న సింగిల్‌విండో మాజీ అధ్యక్షుడు కృష్ణారెడ్డి భూకబ్జా బాగోతం బట్టబయలైంది. గురువారం శెట్టిపల్లి మారెమ్మదిన్నె సమీపంలో శోత్రియం 28సెంట్ల భూమిని రెవెన్యూ అధికారులు భారీ పోలీస్ బందోబస్తు మధ్య సర్వే చేయడంతో కృష్ణారెడ్డి కుటుంబ సభ్యుల వాగ్వాదానికి దిగారు. సర్వేచేసి వెంకోబరావు మనవళ్లకు భూమిని స్వాధీనం చేశారు. వివరాల్లోకెళితే.. శెట్టిపల్లి పంచాయతీలోని మారెమ్మదిన్నె సమీపంలో సర్వే నంబరు 28-2లో 28 సెంట్ల భూమికి వైసీపీ నాయకుడు కృష్ణారెడ్డి అడ్డుపడుతున్నాడు. శోత్రియం భూమిని 2000 సంవత్సరంలో కరణం వెంకోబరావు కుమార్తె సరోజమ్మకు పసుపుకుంకుమ కిందరాసిచ్చారు. వెంకోబరావు కుటుంబ సభ్యులు ఎవరూ గ్రామంలో లేకపోవడంతో వైసీపీ నాయకుడు కృష్ణారెడ్డి భూమిపై కన్నేశాడు. భూమిని కబ్జాచేసి 2022 సంవత్సరంలో కృష్ణారెడ్డి తన భార్య అర్చన పేరుతో ఫేక్‌డాక్యుమెంట్లు సృష్టించి బుక్కపట్నం సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయంలో రిజిస్ట్రేషన్ చేయించుకున్నాడు. విషయం తెలుసుకున్న వెంకోబరావు కుటుంబ సభ్యులు చలపతిరావు, రాఘవేంద్రరావు, అరుణ్‌కుమార్ ఇటీవల శెట్టిపల్లిలో తమభూమిని కబ్జాచేశారని పెనుకొండ ఆర్డీఓ ఆనంద్‌కుమార్‌కు వినతి పత్రం ఇచ్చారు. ఆర్డీఓ ఆదేశాల మేరకు రెవెన్యూ అధికారులు శెట్టిపల్లిలో రెండ్రోజుల క్రితం సర్వేచేపట్టారు. వెంకోబరావు పేరుతోనే 28 సెంట్లు డైక్లాట్‌లో ఉందని రెవెన్యూ అధికారులు తేల్చారు. గురువారం రెవెన్యూ అధికారులతో కలిసి వెంకోబరావు కుటుంబ సభ్యులు భారీ పోలీసు బందోబస్తు మధ్య ఎక్స్‌కవేటర్ సాయంతో భూమి చదును పనులు చేస్తుండగా కృష్ణారెడ్డి కుటుంబ సభ్యులు భూమి తమదేనంటూ వాగ్వాదానికి దిగారు. దాదాపు గంటపాటు ఆందోళన జరగడంతో శెట్టిపల్లిలో హైటెన్షన్ నెలకొంది. తహసీల్దార్ శ్రీధర్, ఆర్ఐ భాస్కర్‌రెడ్డి, కృష్ణారెడ్డి కుటుంబ సభ్యుల మధ్య వాగ్వాదం చోటుచేసుకోవడంతో మీ వద్ద ఉన్న పత్రాలు తీసుకురమ్మని చెప్పడంతో అక్కడి నుంచి వెళ్లిపోయారు. తర్వాత సమస్య సద్దుమణిగింది. కృష్ణారెడ్డి కబ్జా చేసిన స్థలాన్ని సర్వేచేసి ఐదుసెంట్ల భూమిలో అంగన్‌వాడీ భవనానికి భూమిపూజ చేశారు. ఈ సందర్భంగా కరణం వెంకోబరావు మనువళ్లు మాట్లాడుతూ.. శెట్టిపల్లిలో తమ తాత పేరుతో గతంలో వంద ఎకరాలకుపైగా ఉండేదన్నారు. తమ తల్లి సరోజమ్మ పేరుతో తాత 28 సెంట్ల భూమిని పసుపుకుంకుమ కింద రాసిచ్చారని అన్నారు. తాము గ్రామంలో లేకపోయేసరికి కృష్ణారెడ్డి అనే వ్యక్తి భూమిని కబ్జాచేశాడని అన్నారు. అధికారులకు విన్నవించడంతో భూమిని ఇప్పించారని అన్నారు. దీంతో 5సెంట్ల స్థలాన్ని అంగన్‌వాడీ భవనానికి రాసిచ్చినట్లు తెలిపారు.

ఫ్రూట్ కేర్‌తో నాణ్యమైన మామిడి

50 శాతం సబ్సిడీతో పంపిణీ: ఉద్యాన శాఖ జిల్లా అధికారి నరసింహారావు

అనంతపురం అర్బన్, ఫిబ్రవరి 20(ఆంధ్రజ్యోతి): ఫ్రూట్‌కేర్‌తో నాణ్యమైన మామిడి పంట వస్తుందని ఉద్యాన శాఖ జిల్లా అధికారి నరసింహారావు పేర్కొన్నారు. గురువారం స్థానిక ప్రాంతీయ ఉద్యాన శిక్షణా కేంద్రంలో మామిడిలో ఫ్రూట్ కేర్‌పై ఎఫ్‌పీఓలు, ఎన్జీఓలకు అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... ఈ ఏడాది జిల్లాలో 1000 హెక్టార్లలకు అవసరమైన మామిడి రక్షణ కవచం (ఫ్రూట్ కేర్) పంపిణీ చేయాలని ప్రభుత్వం లక్ష్యం విధించిందన్నారు. 50 శాతం సబ్సిడీతో మామిడి రక్షణ కవచం (ఫ్రూట్ కేర్ కవర్) పంపిణీ చేస్తామని తెలిపారు. ఒక్కో రైతుకు హెక్టారుకు 20వేల రక్షణ కవచం కవర్లు ఇస్తామన్నారు. ఒక్కో కవర్ పూర్తి ధర రూ.2 కాగా సబ్సిడీతో రూ.1కి పంపిణీ చేస్తామని అన్నారు. కార్యక్రమంలో టెక్నికల్ హెచ్ఓ పల్లవి పాల్గొన్నారు.




రూ.10 లక్షల చెక్కును ఈఓకు అందజేస్తున్న దాతలు

అన్నదానానికి రూ.10 లక్షల విరాళం

కదిరి, ఫిబ్రవరి 20(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని ఖాద్రీలక్ష్మీ నరసిం హస్వామి దేవస్థానం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న శ్రీవారి నిత్య అన్నదాన పథకానికి బెంగుళూరు నగరం మార్తహళ్లికి చెందిన ఎం. రమేష్‌రెడ్డి, చంద్రిక కుటుంబ సభ్యులు గురువారం రూ.10 లక్షల విరాళం అందించారు. ఈ విరాళాన్ని నిత్యాన్నదాన పథకానికి విని యోగించనున్నట్లు ఆలయ ఈఓ శ్రీనివాసరెడ్డి తెలిపారు. దాతలకు స్వామి, అమ్మవార్ల ఆలయంలో ప్రత్యేక పూజలు చేయించి, తీర్థప్రసాదాలు, స్వామివారి చిత్రపటం, శేషవస్త్రం అందించారు.

సబ్సిడీ రుణాలపై సందిగ్ధం..!



బీసీ కార్పొరేషన్‌లో కొనసాగుతున్న ప్రక్రియ

ఎస్సీ, ఎస్టీ, ముస్లిం, క్రిస్టియన్ల రుణాలపై కొరవడిన స్పష్టత

యూనిట్ వివరాలు కూడా ఖరారు చేయని దుస్థితి

పదే.. పదే.. మార్పులతో గందరగోళం

విస్మయం వ్యక్తం చేస్తున్న ఔత్సాహికులు



ఎస్సీ, ఎస్టీ కార్పొరేషన్ కార్యాలయాల సముదాయం (పెన్నార్ భవన్)

అనంతపురం ప్రెస్‌క్లబ్, ఫిబ్రవరి20(ఆంధ్రజ్యోతి): సబ్సిడీ రుణాలపై సందిగ్ధం నెలకొంది. నేటికీ యూనిట్ల సంఖ్య, విలువను ప్రకటించడంతో దీంతో దరఖాస్తు కూడా చేసుకోలేని దుస్థితి. ఆన్‌లైన్‌లో వివరాలే లేవు. రాష్ట్ర ప్రభుత్వం బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీ నిరుద్యోగ యువత, వ్యాపారుల స్వయం ఉపాధి కోసం సబ్సిడీ రుణాలను అందజేస్తోంది. ఇందుకోసం ఉమ్మడి జిల్లావ్యాప్తంగా పెద్దఎత్తున ఔత్సాహికులు పోటీ పడుతున్నారు. వైసీపీ పాలనలో ఐదేళ్లూ సబ్సిడీ రుణాలకు మంగళం పలికారు. ప్రస్తుతం కూటమి ప్రభుత్వం సబ్సిడీ రుణాలివ్వాలని నిర్ణయించడంతో దరఖాస్తులు వెల్లువలా వచ్చాయి. ఇప్పటికే బీసీ కార్పొరేషన్‌కు సంబంధించి రూ.లక్ష నుంచి రూ.5 లక్షల వరకూ యూనిట్‌గా నిర్ణయించి, దరఖాస్తులు ఆహ్వానించింది. ఔత్సాహికులు వేల సంఖ్యలో దరఖాస్తులు చేసుకున్నారు. ఇప్పటికే ఎంపీడీఓ కార్యాలయాల్లో బ్యాంకర్లు, అధికారులతో ఇంటర్వ్యూలు నిర్వహిస్తున్నారు. ఎస్సీ, ఎస్టీ, మైనార్టీ, క్రిస్టియన్లకు సంబంధించి సబ్సిడీ రుణాలపై మాత్రం నేటికీ స్పష్టత లేదు. దీంతో ఆయావర్గాలు ఆందోళన చెందుతున్నాయి. ఇదే విషయమై ఆయా కార్పొరేషన్ల అధికారులను ఆరాతీస్తే... రాష్ట్రస్థాయి నుంచి రుణాలకు సంబంధించి యూనిట్లను కేటాయించారే తప్ప.. వాటికి అనుమతులు రావాల్సి ఉందని చెబుతున్నారు. దీంతో రుణాలపై ఆశలు పెట్టుకున్న నిరుద్యోగ యువత, ఔత్సాహికులు సందిగ్ధంలో పడ్డారు.

కొనసాగుతున్న ప్రక్రియ

బీసీ కార్పొరేషన్ పరిధిలో 2024-25 సంవత్సరానికి సంబంధించి ఆంధ్రప్రదేశ్ ఆన్‌లైన్ బెనిఫిషియరీ మేనేజ్‌మెంట్ మానిటరింగ్ సిస్టం కింద స్వయం ఉపాధి కోసం రూ.2 లక్షల నుంచి రూ.5లక్షల వరకూ యూనిట్లను నిర్ణయించారు. ఈ ఏడాదికి యూనిట్లను కేటాయించారు. జనరిక్ మెడికల్ షాపు ఏర్పాటు చేసుకునే నిరుద్యోగ యువత కోసం రూ.8 లక్షలు రుణం అందించనున్నారు. నెల రోజులుగా బీసీ కార్పొరేషన్ పరిధిలో రుణాల ప్రక్రియ కొనసాగుతోంది. ఇప్పటికే దరఖాస్తుల స్వీకరణ పూర్తయింది. వేలమంది దరఖాస్తు చేసుకున్నట్లు అధికారుల ద్వారా అందిన సమాచారం. కొన్ని మండలాల్లో బ్యాంకర్లు, ఎంపీడీఓల ఆధ్వర్యంలో దరఖాస్తుదారులకు ఇంటర్వ్యూలు సైతం నిర్వహిస్తున్నారు.

అనంత జిల్లాకు యూనిట్ల కేటాయింపు ఇలా..

కార్పొరేషన్	కేటాయించిన యూనిట్లు	నిధులు విడుదల
బీసీ	1,728	రూ.32.90కోట్లు
ఈబీసీ	102	రూ.1.77కోట్లు
కమ్మ	58	రూ.1.01 కోట్లు
రెడ్డి	29	రూ.50లక్షలు
ఆర్యవైశ్య	21	రూ.36లక్షలు
బ్రాహ్మణ	14	రూ.24లక్షలు
క్షత్రియ	1	రూ.2లక్షలు
జనరిక్ మెడికల్ షాపుల ఏర్పాటుకు..		
బీసీ	35	రూ.2.80కోట్లు
ఈబీసీ	17	రూ.1.36కోట్లు
కమ్మ	9	రూ.72లక్షలు
రెడ్డి	5	రూ.40లక్షలు
ఆర్యవైశ్య		
బ్రాహ్మణ	6	రూ.48లక్షలు

స్పష్టత ఏదీ?

ఎస్సీ, ఎస్టీ, మైనార్టీలకు సంబంధించిన సబ్సిడీ రుణాల విషయంలో స్పష్టత కొరవడిందనే చెప్పాలి. రాష్ట్రస్థాయిలో అన్ని కార్పొరేషన్లకు యూనిట్లవారీగా రుణాల మంజూరుకు నివేదికలు తయారు చేసినట్లు సమాచారం. ఆ మేరకు ఇప్పటికే ఆయా కార్పొరేషన్ల ఈడీలకు ఆదేశాలు జారీ చేశారు. దరఖాస్తుల విషయంలో మాత్రం రాష్ట్ర అధికారుల నుంచి స్పష్టత కొరవడినట్లు సమాచారం. ఎస్సీ కార్పొరేషన్‌కు సంబంధించి అన్ని రకాల పనులు పూర్తయినా రాష్ట్రస్థాయి నుంచి ఆన్‌లైన్ దరఖాస్తుల ప్రక్రియలో స్పష్టత ఇవ్వలేదు. ఎస్టీ కార్పొరేషన్‌లో సబ్సిడీ రుణాలపై ప్రణాళికలే రూపొందించనట్లు సమాచారం. మైనార్టీ కార్పొరేషన్ పరిధిలో రూ.లక్ష కాకుండా... ఏకంగా రూ.5 లక్షలు, రూ.10 లక్షల యూనిట్లు మంజూరు చేయడంతోపాటు... ఉమ్మడి జిల్లావ్యాప్తంగా పదుల సంఖ్యలోనే కేటాయించినట్లు తెలుస్తోంది. ఈ విషయంలో సైతం రాష్ట్రస్థాయి అధికారులు పునరాలోచనలో పడటంతో రుణాలపై గందరగోళం నెలకొన్నట్లు ఆయా కార్పొరేషన్ల అధికారుల ద్వారా అందిన సమాచారం. దీంతో పలువురు ఔత్సాహికులు.. ఆయా కార్పొరేషన్ల కార్యాలయాల చుట్టూ తిరుగుతున్నారు.



ప్రతిపాదనలు పంపాం

మైనార్టీ కార్పొరేషన్‌లో సబ్సిడీ రుణాలకు సంబంధించి రాష్ట్రస్థాయి అధికారులు వివరాలు అడిగారు. ఆ మేరకు ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా ప్రతిపాదనలు పంపాం. అక్కడి నుంచి ఆదేశాలు అందితే... అమలు చేస్తాం.

- సుబ్రహ్మణ్యం, ఇన్‌చార్జి ఈడీ, మైనార్టీ కార్పొరేషన్

కసరత్తు చేస్తున్నాం

గిరిజన కార్పొరేషన్ సబ్సిడీ రుణాలకు సంబంధించి రాష్ట్రస్థాయి నంచి ఆదేశాలు రావాల్సి ఉంది. రుణాలపై కసరత్తు చేస్తున్నాం. రాష్ట్రస్థాయి అధికారులు త్వరలోనే క్లారిటీ ఇస్తామంటున్నారు. వచ్చిన వెంటనే దరఖాస్తులు ఆహ్వానించి, ప్రక్రియ పూర్తి చేస్తాం.

- రామాంజనేయులు, జిల్లా గిరిజన సంక్షేమ శాఖాధికారి



నేటి ప్రముఖులు

పోర్ట్రైట్ ఆర్టిస్ట్ కే.శే. శంకరనారాయణ కాలమ్...

ది మదర్ (మీరా అల్ఫాస) (జయంతి)



'ది మదర్'గా పేరొందిన మీరా అల్ఫాస 1878 ఫిబ్రవరి 21న ఫ్రాన్స్ దేశం ప్యారిస్ నగరంలో జన్మించారు. ఆధ్యాత్మిక గురువులలో ఒకరిగా పేరొందారు. అరబిందో (అరవింద) ఆశ్రమ భక్తులు ఆమెను 'తల్లి' (మాత)గా పరిగణిస్తారు. అరవిందతో కలసి అతీత మానస యోగా విధానాన్ని ప్రారంభించారు. కాలక్రమంలో మీరా మారిసెట్, మీరా రిచర్డ్‌గాను పేరొందారు. కేంద్రపాలిత ప్రాంతమైన పాండిచ్చేరి రాష్ట్రం ఆరోవిల్లెలో అరవింద ఆశ్రమాన్ని ఏర్పాటు చేశారు. ఇంటిగ్రల్ యోగా ద్వారా ఎంతోమంది రచయితలను, ఇతరులను ప్రభావితం చేశారు. 1973 నవంబరు 17న కన్నుమూశారు.

భూపతి కృష్ణమూర్తి (జయంతి)



తెలంగాణ సరిహద్దు గాంధీగా పేరొందిన భూపతి కృష్ణమూర్తి 1926 ఫిబ్రవరి 21న వరంగల్ జిల్లా ముల్కనూరు గ్రామంలో జన్మించారు. చిన్నతనం నుంచి స్వతంత్ర భావాలు కల్గిన ఆయన స్వాతంత్ర్య సంగ్రామంలో క్రియాశీలకంగా పనిచేశారు. తెలంగాణ ఉద్యమంలోనూ పాల్గొన్నారు. యువకులు, మేధావి వర్గాలు కలసి హైదరాబాద్‌లో తెలంగాణ ప్రజా సమితి (టీపీఎస్) స్థాపించగా టీపీఎస్‌కు అధ్యక్షుడిగా ఉండి పార్టీని నడిపించారు. మలిదశ ఉద్యమంలోనూ పాల్గొన్నారు. వయసు సహకరించకున్నా ఉద్యమంలో భాగస్వామ్యులయ్యారు. తెలంగాణ రాష్ట్రాన్ని చూసి తనువు చాలిస్తానన్న భూపతి... అన్నట్టుగానే ప్రత్యేక రాష్ట్రాన్ని కళ్లారా చూసి 2015 ఫిబ్రవరి 15న కన్నుమూశారు.

అభిజిత్ బెనర్జీ (పుట్టినరోజు)



అభిజిత్ వినాయక బెనర్జీ 1961 ఫిబ్రవరి 21న బాంబేలో జన్మించారు. ఆర్థికశాస్త్రంలో ప్రొఫెసర్‌గా మస్సాచుసెట్స్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీలో సేవలందిస్తున్నారు. ఆర్థికశాస్త్రంలో సేవలకు 2019లో నోబెల్ స్మారక పురస్కారాన్ని భార్య ఈస్తర్ డఫ్లో, మైఖేల్ క్రెమెర్‌లతో కలసి అందుకున్నారు. అబ్దుల్ లతీఫ్ జమీల్ పావర్టీ యాక్షన్ ల్యాబ్‌కు సహ సంస్థాపకులు. పేదరిక నిర్మూలనకు తీసుకోవాల్సిన అంశాలపై పలు పరిశోధనలు చేయడమేకాక రచనలు చేశారు. వివిధ యూనివర్సిటీలనుంచి గౌరవ పురస్కారాలు అందుకున్నారు.

'ముడా' డీ నోటిఫికేషన్‌లో అక్రమాలు

● ముఖ్యమంత్రిపై బీజేపీ నేత రమేష్ ఫిర్యాదు

బెంగళూరు, ఫిబ్రవరి20 (ఆంధ్రజ్యోతి): ముఖ్యమంత్రి సిద్దరామయ్య, ముడా అధ్యక్షుడు బసవేగౌడలు ముడాకు సంబంధించి డీ నోటిఫికేషన్‌లో అక్రమాలకు పాల్పడ్డారని సమగ్ర విచారణలు జరిపించాలంటూ బీజేపీ నేత ఎన్ఆర్ రమేష్ లోకాయుక్తకు ఫిర్యాదు చేశారు. గురువారం ఆయన లోకాయుక్త ఐజీపీ సుబ్రమణ్యేశ్వరరావ్‌కు వివిధ ఆధారాలతో కూడిన వినతిని అందించారు. అనంతరం లోకాయుక్త కార్యాలయం ఎదుట ఎన్ఆర్ రమేష్ మీడియాతో మాట్లాడారు. ఎటువంటి డీ నోటిఫికేషన్ చేయదలచినా రాష్ట్ర ప్రభుత్వంకు మాత్రమే అమలు చేయాల్సి ఉందన్నారు. కానీ ముడా అధ్యక్షుడు బసవేగౌడ ముందుగా నిర్ణయం తీసుకుని ఆతర్వాత డీ నోటిఫికేషన్ చేయించారన్నారు. నిబంధనల ప్రకార ముడా నుంచి భూస్వాధీనం కోసం పరిహార ధనాన్ని భూయజమానులు పొందారన్నారు. ముడాలో విజయనగర రెండో విడత లేఅవుట్‌లో కొన్ని స్థలాలను 12 ఏళ్ల తర్వాత డీ నోటిఫికేషన్ చేశారన్నారు. కేవలం సిద్దరామయ్య కోసమే చట్ట వ్యతిరేకంగా వ్యవహరించారన్నారు. అవినీతి, అధికార దుర్వినియోగం, నకిలీ రికార్డుల తయారీ, మోసం, ప్రభుత్వ భూమి స్వాధీనంకు సహకరించినందుకు కేసులు నమోదు చేయాలని కోరారు. ఇదే అవినీతికి సంబంధించిన ఆధారాలను 17ఎ నిబంధనల కింద విచారణలకు ఆదేశించాలని రాష్ట్ర గవర్నర్‌కు వినతి పంపినట్లు తెలిపారు.



లోకాయుక్త డీఐజీకి వివరాలు అందిస్తున్న ఎన్ఆర్ రమేష్

సమాజం కోసం పాటుపడిన మహనీయుడు సర్వజ్ఞ

● ఎమ్మెల్యే ఎస్ఎన్ నారాయణస్వామి



సర్వజ్ఞ జయంతిలో ఎమ్మెల్యే నారాయణస్వామి తదితరులు

బంగారపేట, ఫిబ్రవరి 20 (ఆంధ్రజ్యోతి): కన్నడనాట మహా తత్వవేత్త, త్రిపది బ్రహ్మ, అత్యంత సరళంగా ప్రజల హృదయాలలో వైరాగ్యం, సత్యం మానవత్వం అంశాలపై అవగాహన కల్పించి సమాజంలో మార్పుకోసం పాటుపడిన మహనీయుడు సర్వజ్ఞ అని ఎమ్మెల్యే ఎస్ఎన్ నారాయణ స్వామి పేర్కొన్నారు. పట్టణంలోని తాలూకా కార్యాలయంలో తాలూకా యంత్రాంగం, కుంబారసంఘం సంయుక్తంగా గురువారం సర్వజ్ఞ జయంతి సందర్భంగా చిత్రపటానికి పుష్పాంజలి ఘటించారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ అన్నం ఉన్నంతవరకు ప్రతి ప్రాణిలో దైవం ఉంటారని త్రిపదుల ద్వారా చాటి చెప్పిన మహనీయుడు సర్వజ్ఞ అన్నారు. చరిత్రకారుల ప్రకారం కొన్ని త్రిపదులు వేర్వేరు రచయితల ద్వారా బయటపడ్డాయన్నారు. సమాజం కోసం పాటుపడినవారిలో సర్వజ్ఞ ఒకరన్నారు. సర్వజ్ఞ జయంతిని ముఖ్యమంత్రి సిద్దరామయ్య ప్రభుత్వం సరళంగా ఆచరించడంపై కొంత అసంతృప్తి వ్యక్తం చేశారు. కాగా కుంబార సముదాయానికి భవన నిర్మాణానికి 5 గుంటల భూమి ఇచ్చామని అయితే ఇంతవరకు నిర్మాణాలు చేపట్టకపోవడంతో ఆక్రమణకు గురైనట్టు తెలుస్తోందన్నారు. వెంటనే ఆక్రమణలు తొలగించి భవన నిర్మాణానికి రూ.5లక్షల సహాయం ఇవ్వనున్నట్టు ప్రకటించారు. కార్యక్రమంలో తహశీల్దార్ కేఎన్ సుజాత, గ్రేడ్-2 తహశీల్దార్ గాయత్రి, కుంబారసంఘం అధ్యక్షుడు కుంబారపాళ్య మంజునాథ్, గౌరవ అధ్యక్షుడు ఆదినారాయణ, పురసభ అధ్యక్షుడు గోవింద, జయరాం, సోమణ్ణ, టీచర్ రాజప్ప, శ్రీనాథ్, సుబ్రమణి పాల్గొన్నారు.

సిరుగుప్ప, (ఆంధ్రజ్యోతి) : సర్వజ్ఞ తత్వ సిద్ధాంతాలను ప్రతి ఒక్కరూ పాటించాలని తహసీల్దార్ విశ్వనాథ్ పిలుపునిచ్చారు. గురువారం పట్టణంలో తహసీల్దార్ కార్యాలయంలో సర్వజ్ఞ జయంతి వేడుకలను నిర్వహించారు. ఆయన భావచిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. సర్వజ్ఞ తత్వాలను నేటికీ మరువరాదని ఆయన కొనియాడారు. కర్ణాటకలో ఎంతో పేరు ప్రఖ్యాతలు పొందిన కవిసార్వభౌమి అని అన్నారు. ఈ కార్యక్రమంలో ఆర్ఐ మంజునాథ, మేనేజర్ మాంతేష, సిబ్బంది పాల్గొన్నారు.

కంప్లి : కంప్లి తహసీల్దార్ కార్యాలయంలో కవి సర్వజ్ఞ జయంతిని కుమ్మర సమాజం వారు భక్తిశ్రద్ధలతో నిర్వహించుకున్నారు. వారితో పాటు అధికారులు కూడా కవి సర్వజ్ఞ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ప్రతి ఒక్కరు కవి సర్వజ్ఞను ఆదర్శంగా తీసుకుని ముందడుగు వేస్తే తమసమాజానికి గుర్తింపు లభిస్తుందని మెట్రి కుమ్మర సమాజం రాజా తెలిపారు. ఈ కార్యక్రమంలో కుమ్మర సమాజం నాయకులు, రెవెన్యూ అధికారులు పాల్గొన్నారు.

రాయచూరు, (ఆంధ్రజ్యోతి) : జిల్లా యంత్రాంగం, జిల్లా పంచాయతీ, నగరసభ, కన్నడ మరియు సాంస్కృతిక శాఖ, కుంబార సంఘం జిల్లా శాఖ సంయుక్తాద్వర్యంలో గురువారం జిల్లా కేంద్రంలో త్రిపదికవి సర్వజ్ఞ జయంతిని వైభవంగా ఆచరించారు. ఉదయం స్థానిక కనకదాస(గంజ్) సర్కిల్ నుంచి ప్రధాన వీధుల గుండా త్రిపదికవి సర్వజ్ఞ చిత్రపటంతో ఊరేగింపు నిర్వహించారు. ఈ సందర్భంగా సిటీ ఎమ్మెల్యే డాక్టర్ శివరాజ్ పాటీల్, మహానగర పాలిక అధ్యక్షురాలు నరసమ్మ, కన్నడ మరియు సాంస్కృతిక శాఖ అధికారులతో పాటు సమాజ ప్రముఖులు తదితరులు పాల్గొన్నారు.



సిరుగుప్ప తహసీల్దార్ కార్యాలయంలో..

తత్వసిద్ధాంతాలను పాటించాలి

త్రిపది కవిగా ఖ్యాతి గాంచిన సర్వజ్ఞ తత్వ సిద్ధాంతాలను పాటించాలని కల్యాణ కర్ణాటక కుంబార సంఘం అధ్యక్షుడు వై.సురేంద్రబాబు పిలుపునిచ్చారు. గురువారం స్థానిక రంగమందిరంలో జిల్లా యంత్రాంగం, జిల్లా పంచాయతీ, నగరసభ, కన్నడ మరియు సాంస్కృతిక శాఖ, కుంబార సంఘం జిల్లా శాఖ సంయుక్తాద్వర్యంలో ఏర్పాటు చేసిన త్రిపదికవి సర్వజ్ఞ జయంతి కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ 12వ శతాబ్దంలో సర్వజ్ఞ ఎన్నో వచనాలను రచించారన్నారు. సర్వజ్ఞ తత్వ సిద్ధాంతాలను ప్రతి ఒక్కరూ పాటించాలన్నారు. ఆయన సిద్ధంతాలు పేద ప్రజల వృద్ధికి నాంది అవుతుందన్నారు. ఈ సందర్భంగా సమాజ ప్రముఖులు తదితరులు పాల్గొన్నారు.



కంప్లి తహసీల్దార్ కార్యాలయంలో..



రాయచూరు సాంస్కృతిక భవనంలో..

రెచ్చగొట్టే ప్రసంగం చేసిన మౌల్వి అరెస్టు

బెంగళూరు, ఫిబ్రవరి20 (ఆంధ్రజ్యోతి): మైసూరు నగరం ఉదయగిరి పోలీసుస్టేషన్‌పై దాడి ఘటనలో రెచ్చగొట్టేలా ప్రసంగం చేసిన మౌల్వి ముఫ్తి ముస్తాక్ మక్బోలిను పోలీసులు అరెస్టు చేశారు. గత వారం మైసూరుకు చెందిన సతీష్ అనే యువకుడు ఢిల్లీ ఎన్నికల ఫలితాలపై ఓ రాజకీయ నేతలు రాహుల్‌గాంధీ, అరవింద్ కేజ్రీవాల్, అఖిలేష్‌యాదవ్‌ల ఫొటోలతో పాటు మతగురువు పట్ల హేళనగా ఎక్స్‌లో పోస్టు చేయడంతో వివాదం జరిగింది. దీంతో పోలీసులు సతీష్ అనే వ్యక్తిని అరెస్టు చేశారు. అదే రోజున రాత్రి పెద్దసంఖ్యలో చేరిన ఓ సామాజిక వర్గీయులకు పోలీసులకు మధ్య వాగ్వాదం జరిగింది. ఇదే సందర్భంలోనే పలువురు కస్టడీలో ఉండే సతీష్‌ను తమకు అప్పగించాలని డిమాండ్ చేశారు. ఇదే తరుణంలోనే మౌల్వి రెచ్చగొట్టేలా ప్రసంగం చేసినట్లు పోలీసులు గుర్తించారు. పోలీసుస్టేషన్‌పై రాళ్ళురువ్వడంతో పదిమందికిపైగా పోలీసులు గాయపడ్డారు. కేసును విచారిస్తున్న సీసీబీ పోలీసులు ముఫ్తీ ముస్తాక్ మక్బోలిను అరెస్టు చేశారు. కాగా ఇదే కేసును విచారణలు జరుపుతున్న ముగ్గురు పోలీసు అధికారులను తాజాగా బదిలీ చేశారు. పోలీసు బందోబస్తు ఉదయగిరి పోలీసుస్టేషన్ పరిధిలో కొనసాగుతోంది.

మహిళ కిడ్నాప్.. దాడి

బెంగళూరు, ఫిబ్రవరి20 (ఆంధ్రజ్యోతి): చిక్కబళ్ళాపుర జిల్లా గుడిబండ తాలూకా జగనహళ్ళిలో ఓ మహిళపై దాడి జరిగింది. బెంగళూరుకు చెందిన సంగీతా అనే మహిళను కిడ్నాప్ చేసి తీసుకెళ్ళి జగనహళ్ళిలోని ఓ తోటలో బంధించారు. ఆమెను క్రికెట్ బ్యాట్లు, రాడ్‌లతో కొట్టారు. కళ్ళపైనా దాడి చేశారు. గంగరాజు అనే వ్యక్తి బెంగళూరుకు చెందిన సంగీత అనే యువతిని రెండో పెళ్ళి చేసుకున్నారు. మూడునెలల కిందట వివాహం కాగా ఇటీవలే విషయం గంగరాజు మొదటి భార్య బంధువులకు తెలిసింది. దీంతో సంగీతను కిడ్నాప్ చేసి తీసుకువచ్చి దుర్మార్గంగా వ్యవహరించారు. విషయం వెలుగులోకి రాగానే గుడిబండ పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు. బాధిత మహిళను ఆసుపత్రిలో చేర్పించి చికిత్స అందిస్తున్నారు.

నైజీరియన్ హత్య

బెంగళూరు, ఫిబ్రవరి 20(ఆంధ్రజ్యోతి): నగరంలోని బాగలూరు పరిధిలో నైజీరియన్ బుధవారం హత్యకు గురయ్యారు. ఇదే ప్రాంతంలో నివసించే నైజీరియన్ వాసి అద్వాలె సిక్రు(51) సమీపంలోని దుకాణం నుంచి చికెన్ కొనుగోలుకు వెళ్ళారు. అక్కడ స్థానిక వ్యక్తి యాసిన్‌ఖాన్ అలియాస్ డ్యాగన్‌తో వాగ్వాదం జరిగింది. అంతలోనే యాసిన్‌ఖాన్ ఒక్కసారిగా దాడి చేశారు. భయపడిన నైజీరియన్ అక్కడి నుంచి వెళ్ళిపోతుండగా వెంబడించిన యాసిన్‌ఖాన్ మారణాయుధాలతో దాడి చేశారు. ఒక్కసారిగా కుప్పకూలాడు. అక్కడే ఓ బండమీద నైజీరియన్‌ను ఉంచి యాసిన్‌ఖాన్ పరారీ అయ్యారు. స్థానికుల సమాచారంతో బాగలూరు పోలీసులు కేసు నమోదు చేసుకున్నారు. నిందితుడిని అదుపులోకి తీసుకుని విచారణలు జరుపుతున్నారు.

శుద్ధతాగునీటి కేంద్రం ప్రారంభం



వాటర్ ప్లాంట్ ప్రారంభోత్సవంలో మంత్రి జమీర్‌అహ్మద్‌ఖాన్

విజయనగర్, ఫిబ్రవరి 20 (ఆంధ్రజ్యోతి): చామరాజపేట నియోజకవర్గంలోని పలు వార్డులలో గురువారం వసతిశాఖ మంత్రి జమీర్‌అహ్మద్ ఖాన్ వేర్వేరు వార్డులలో పలు అభివృద్ధి పనులను ప్రాంభించారు. మక్కళకూట సమీపాన చిన్నారులకు అవసరమైన ఆటస్థలం, పాఠశాల గదులను, మరో వార్డులో శుద్ధతాగునీటి కేంద్రాన్ని ప్రారంభించారు. మాజీ కార్పొరేటర్ చంద్రశేఖర్ (అప్పోడు), స్థానిక ప్రముఖులు పాల్గొన్నారు. యూత్ కాంగ్రెస్ నాయకులు, కేఎండీసీ చైర్మన్ బీకే ఖాన్, జనాబ్ అఫ్జల్ ఖాన్ సాహెబ్, శశికళ చంద్రశేఖర్, రావిప్రసాద్, ఫయాజ్, నారాయణ స్వామి తదితరులు పాల్గొన్నారు.

రేపు మెగా ఉద్యోగమేళా



పోస్టర్లు విడుదల చేస్తున్న లియో క్లబ్ అధ్యక్షుడు శ్రీకాంత్ తదితరులు

శిడ్లఘట్ట, ఫిబ్రవరి 20 (ఆంధ్రజ్యోతి): శిడ్లఘట్ట పట్టణంలోని వాసవి విద్యాసంస్థలో ఈనెల 22న శనివారం మెగా ఉద్యోగమేళా నిర్వహించనున్నట్టు లియో క్లబ్ అధ్యక్షుడు ఎస్ శ్రీకాంత్ వెల్లడించారు. పట్టణంలో ఆయన మీడియాతో మాట్లాడుతూ లియోక్లబ్ ఆఫ్ కిరణ్, ఇతర సంఘ సంస్థల ఆధ్వర్యంలో మేళా ఏర్పాటు చేస్తున్నామన్నారు. రాష్ట్రవ్యాప్తంగా 50కుపైగాప్రముఖ కంపెనీలు పాల్గొంటున్నాయన్నారు. ఎస్ఎస్ఎల్‌సీ, పీయూసీ, డిగ్రీ, ఐటిఐ, డిప్లమో తదితర కోర్సులు చేసి ఆసక్తిగలవారు మేళాలో పాల్గొనవచ్చునన్నారు. పేర్ల నమోదు ఇతర వివరాలకు లోకేశ్ 84317 75991, దుర్గాప్రసాద్ 9663871469ను సంప్రదించాలని తెలిపారు. మీడియా సమావేశంలో లియోక్లబ్ కార్యదర్శి లోకేశ్, గోవర్ధన్, అక్షిత్, మురళి, కన్నడ సాహిత్య పరిషత్ అధ్యక్షుడు పటేల్ నారాయణస్వామి, వాసవి విద్యాసంస్థకు చెందిన రూపసి రమేశ్, కస్తూరి కర్నాటక జనపర వేదిక జిల్లా అధ్యక్షుడు రామాంజనేయ, నాగేశ్, కరవే తాలూకా అధ్యక్షుడు సునిల్ తదితరులు పాల్గొన్నారు.

క్యాన్సర్‌ను ప్రారంభదశలో గుర్తిస్తే

సంపూర్ణ నయం సాధ్యం

మహదేవపుర, ఫిబ్రవరి 20 (ఆంధ్రజ్యోతి): వైద్యరంగంలోనూ ఆధునిక సాంకేతిక విధానాలు సాధ్యం అవుతున్నాయని తద్వారా క్యాన్సర్ చికిత్సలోనూ మెరుగు సాధ్యం అవుతోందని మెడికవర్ ఆసుపత్రి ముఖ్యులు కృష్ణమూర్తి అభిప్రాయపడ్డారు. వైట్‌ఫీల్డ్ పరిధిలోని హూడిలో మెడికవల్ ఆసుపత్రిలో కీమోథెరపీ చికిత్సకు సంబంధించి డే కేర్ సెంటర్‌ను గురువారం లాంచనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ క్యాన్సర్‌ను ప్రారంభదశలో గుర్తిస్తే పరిపూర్ణంగా గుణం చేసే అవకాశాలు ఉన్నాయన్నారు. టార్గెటెడ్ థెరపీ, ఇమ్యునోథెరపీ సాంకేతిక విధానాలతో టర్మినల్ కేన్సర్ బాధితులు కూడా మరింతకాలం జీవించే అవకాశం ఉందన్నారు. ఈ సందర్భంగా మెడికవర్ గ్రూప్ నీరాజ్ జైసువాల్, డాక్టర్ శృతి కొయ్లి, డాక్టర్ కాకోలి సహా ఆసుపత్రి సీనియర్ వైద్యులు, పాలకమండలి సభ్యులు పాల్గొన్నారు.

బస్సు సౌకర్యం కల్పించాలని

విద్యార్థుల వినతి



కాలినడకన వెళుతున్న విద్యార్థులు

కంప్లి, ఫిబ్రవరి 20(ఆంధ్ర జ్యోతి): విద్యాభ్యాసం కోసం ప్రభుత్వాలు ఎన్నో సదుపాయాలు కల్పించి విద్యార్థులను ఆదుకుంటున్నాయి. కానీ ఇప్పటికీ మారుమూలన వుండే గ్రామాలకు ఈ బస్సు సదుపాయాలు సక్రమంగా లేక ఇప్పటికీ విద్యార్థులు కాలి నడకన వెళ్లి చదువుకోవాల్సిన పరిస్థితి నెలకొంది. కొందరైతే సౌకర్యాలు లేక ఇళ్లకే పరిమితమవుతున్నారు. విజయనగర జిల్లా హగరి బొమ్మనళ్లి తాలుకా పరిధిలోని ఆనందదేవనహళ్లి గ్రామానికి చెందిన విద్యార్థులు సుమారు రెండున్నర కిలోమీటర్ల దూరాన వున్న అంకసముద్రం పాఠశాలకు ప్రతిరోజు 25 మంది నడవాల్సిందే.. ఈ విషయంపై ఎన్నోసార్లు అధికారులకు ఫిర్యాదు చేసినా ఇంతవరకు బస్సు సౌకర్యం కల్పించలేదని విద్యార్థులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.. వర్షాకాలంలో అయితే పిడుగులు, ఉరుములు, ఎండ కాలంలో మండుటెండల వల్ల పూర్తిగా ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని తెలిపారు. ఇప్పటికైనా స్థానిక ప్రజాప్రతినిధులు విద్యార్థుల కష్టాలను దృష్టిలో ఉంచుకుని బస్సు సౌకర్యం కల్పించాలని కోరుకుంటున్నారు.

బాల్య వివాహాలపై కఠిన చర్యలు : కలెక్టర్



మొక్కకు నీరు పోసి కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న కలెక్టర్ దివాకర్

హొస్పేట (విజయనగరం), ఫిబ్రవరి 20 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలో ఎక్కడైనా బాల్య వివాహాలు నిర్వహిస్తే కఠినచర్యలు తప్పవని కలెక్టర్ హెచ్చరించారు. జిల్లా వ్యాప్తంగా 47 బాల్య వివాహ కేసుల్లో పోక్సో కింద కేసులు నమోదయ్యాయని జిల్లా కలెక్టర్ ఎంఎస్ దివాకర్ తెలిపారు. భేటీ బచావో భేటీ పడావో పథకం పదవ వార్షికోత్సవాన్ని పురస్కరించుకుని జిల్లా యంత్రాంగం, జిల్లా పరిషత్, మహిళా శిశు అభివృద్ధి శాఖ, చైతన్య గ్రామీణాభివృద్ధి విద్యా ట్రస్టు సహకారంతో మిషన్ శక్తి యోజన కింద బాల్య వివాహ నిషేధ చట్టం 2006, పోక్సో చట్టం 2012పై నిర్వహించిన జిల్లా స్థాయి వర్క్‌షాపును గురువారం ఆయన ప్రారంభించి మాట్లాడారు. బాల్యవివాహాల ఆచారం పూర్తిగా నిషేధించబడిందని, బాల్య వివాహాల నిషేధం, పోక్సో చట్టం చాలా కఠినమైన శిక్షలను కలిగి ఉన్నాయని, ఈ కేసుల్లో మైనర్ బాలికను వివాహం చేసుకున్న యువకుడిపై కేసు నమోదు చేయబడుతుందన్నారు. దీంతో పాటు కుటుంబ సభ్యులపై చర్యలు తీసుకోబడతాయన్నారు. దీంతో పాటు కుటుంబ సభ్యులపై చర్యలు తీసుకోబడతాయన్నారు. దీనివల్ల మైనర్ బాలికలతో సహా బాల్య వివాహాలు కుటుంబాలు ఇబ్బందుల్లో పడతాయన్నారు. బాల్య వివాహాల వల్ల ప్రసూతి మరణాలు సంభవిస్తాయి. ఒక దేశ అభివృద్ధి సూచికను లెక్కించడంలో మాతృ శిశు మరణాల రేటును పరిగణనలోకి తీసుకుంటారు. ఇది దేశాభివృద్ధికి కూడా ఆటంకం కలిగిస్తుందన్నారు.

పనుల్లో నాణ్యత తగ్గితే చర్యలు

● జడ్పీ సీఈఓ రాహుల్ శరణప్ప



అధికారులతో మాట్లాడుతున్న సీఈఓ రాహుల్ శరణప్ప

కంప్లి, ఫిబ్రవరి 20 (ఆంధ్ర జ్యోతి): గ్రామాల్లో జరిగే అభివృద్ధి పనుల్లో నాణ్యత లోపిస్తే చర్యలు తప్పవని జిల్లా పంచాయతీ సీఈఓ రాహుల్ శరణప్ప సంకనూరు హెచ్చరించారు. కురుగోడు తాలుకా పరిధిలోని సోమసముద్రం గ్రామంలో జరుగుతున్న వివిధ పనులను ఆయన గురువారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అభివృద్ధి విషయంలో అధికారులతో పాటు ప్రజలు కూడా బాధ్యత తీసుకోవాలన్నారు. అప్పుడే గ్రామాలు అభివృద్ధి చెందుతాయన్నారు. కాంట్రాక్టర్లు నాణ్యత పాటించకపోతే చర్యలు తప్పవన్నారు. తాలుకా అధికారులు కూడా పనులను పరిశీలిస్తూ పనులు లోపించకుండా చూడాలని కోరారు. వారితో పాటు జిల్లా ఉప కార్యదర్శి గిరిజా శంకర్, కురుగోడు తాలుకా ఈవో నిర్మల, అసిస్టెంట్ డైరెక్టర్ శివరామిరెడ్డి, పీడీవో సిద్దలింగప్ప, తదితరులు పాల్గొన్నారు.

యువతతోనే దేశ భవిష్యత్తులో మార్పు


● తాలూకా సివిల్ న్యాయాధికారి ఈరప్ప

సిరుగుప్ప, ఫిబ్రవరి 20(ఆంధ్రజ్యోతి): దేశ భవిష్యత్తు మార్పు యువతతోనే సాధ్యమని, ప్రతి ఒక్కరూ విద్య, ఆర్థిక, రాజకీయ రంగాల్లో ముందడుగు వేయాలని సిరుగుప్ప తాలుకా సివిల్ న్యాయాధికారి ఈరప్ప పేర్కొన్నారు. సిరుగుప్ప పట్టణంలో గురువారం జయమేరీ పాఠశాలలో న్యాయవాదుల దినోత్సవం, చట్టంపై అవగాహన కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమంలో న్యాయాధికారి ఈరప్ప మాట్లాడుతూ విద్యార్థులు శ్రద్ధగా చదువుకుని ఉత్తమ ఫలితాలు సాధించాలన్నారు. ప్రతిపౌరుడు రాజకీయం, ఆర్థిక రంగాలలో ముందడుగు వేయాలని కోరారు. న్యాయవాదుల సంఘం అధ్యక్షుడు వెంకోబ, న్యాయవాదులు అబ్దుల్, వెంకటేష్, మంజునాథ, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.




కనువిందు చేస్తున్న జలపాతాలు

కంప్లి, ఫిబ్రవరి 20(ఆంధ్రజ్యోతి) : హంపి విరుపాక్షేశ్వరస్వామి ఆలయ వెనుక భాగంలో జలపాతాలు కనువిందు చేస్తున్నాయి. గత వర్షాకాలం అధిక వానల కారణంగా ఈ ఏడు ఇంకా జలకళ తగ్గలేదు. కొండ ప్రాంతాల్లో నదిలో నుంచి జలపాతాలు పర్యాటకులను ఎంతో కనువిందు చేస్తున్నాయి. ఈ ప్రదేశం హంపికు రెండు కిలోమీటర్ల దూరంలో పొదలు, కొండలు దాటితే ఈ ప్రాంతాలను తిలకించవచ్చు. కానీ ఈ ప్రదేశానికి కొందరు యువకులు మాత్రమే చేరుకుని అక్కడ తిలకిస్తారు. ఆ ప్రాంతానికి కూడా వాహనాలు వెళ్లేలా చర్యలు తీసుకుంటే హంపి పుణ్యక్షేత్రం ఆ ప్రాంతం కూడా పర్యాటక కేంద్రంగా మారుతుందని స్థానికులు తెలుపుతున్నారు. ఈ హంపి ఉత్సవాలను పురస్కరించుకుని మండపాలతో పాటు కొండల్లో నుంచి పారుతున్న జలపాతాల ప్రాంతానికి కూడా రోడ్డు ఏర్పాటు చేయాలని కోరుతున్నారు. వేసవి ప్రారంభం లోనే ఎండలు మండుతుండడంతో యువకులు అక్కడికి చేరుకుని ఉల్లాసంగా గడుపుతున్నారు.



కొండల మధ్య నుంచి పారుతున్న జలపాతాలు



తుంగభద్ర నీటి మట్టం : 1633 అడుగులు

	ప్రస్తుతం	గత ఏడాది
నీటి మట్టం (అడుగులు)	1610.66	1,587.70
ఇన్‌ఫ్లో (క్యూసెక్కులు)	0	0
ఔట్ ఫ్లో (క్యూసెక్కులు)	9,043	506
నీటి నిల్వ (టీఎంసీలు)	38.89	9.22

అభివృద్ధి పనులను పరిశీలించిన ఎమ్మెల్యే



అధికారులతో చర్చిస్తున్న ఎమ్మెల్యే గవియప్ప

హంపిలో బళ్లారి సిటీ, ఫిబ్రవరి 20(ఆంధ్రజ్యోతి): చారిత్రక హంపిలో జరుగుతున్న అభివృద్ధి పనులను ఎమ్మెల్యే హెచ్.ఆర్.గవియప్ప గురువారం పరిశీలించారు. హంపి ఉత్సవం కోసం జరుగుతున్న పనులను పరిశీలించిన తర్వాత, విరూపాక్షేశ్వర్ ఆలయం సమీపంలోని తుంగభద్ర నది ఒడ్డున ప్రజా పనుల శాఖ ప్రత్యేక నిధులతో చేపడుతున్న స్నాన ఘాట్ అభివృద్ధి పనులను ఆయన పరిశీలించారు. టూరిజం ప్లాజా వద్ద జరుగుతున్న అభివృద్ధిని కూడా ఆయన పరిశీలించారు. వీలైనంత త్వరగా ఈ స్థలాన్ని ప్రజల ఉపయోగం కోసం ప్రారంభించాలని అధికారులను ఆదేశించారు. ఈసందర్భంగా పురావస్తు శాఖ అధికారులు,ప్రజాపనుల శాఖ అసిస్టెంట్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ రవినాయక్ సహా పోలీసు అధికారులు హాజరై సమాచారం అందుకున్నారు.

విలీనం పేరుతో పాఠశాలలు మూసివేయడం తగదు : ఏఐడీఎస్ఓ



జిల్లా కార్యదర్శి కంబలి మంజునాథ్

బళ్లారి సిటీ,ఫిబ్రవరి 20(ఆంధ్రజ్యోతి): విలీనం పేరుతో రాష్ట్ర ప్రభుత్వం 6వేల పాఠశాలలను మూసివేయాలని రాష్ట్ర ప్రభుత్వం తీసుకున్న నిర్ణయం విద్యావ్యవస్థలో తీరని వినాశకరమైన నిర్ణయమని, తల్లిదండ్రుల నుంచి వ్యతిరేకత ఉన్నప్పటికీ పాఠశాలలను మూసివేయడం రాష్ట్ర ప్రభుత్వం అహంకారానికి అద్దం పడుతోందని ఏఐడీఎస్ఓ బళ్లారి జిల్లాకార్యదర్శి కంబలి మంజునాథ్ ఆగ్రహం వ్యక్తం చేశారు. ఎటువంటి ప్రజాస్వామ్య ప్రక్రియను అనుసరించకుండా అకస్మాత్తుగా పాఠశాలలను మూసివేస్తూ పేద విద్యార్థుల భవిష్యత్తుతో చెలగాటం ఆడుతున్న రాష్ట్ర ప్రభుత్వానికి వ్యతిరేకంగా జరిగే పోరాటంలో విద్యాభిమానులు, విద్యార్థులు, తల్లిదండ్రులు అందరూ పాల్గొనాలని ఏఐడీఎస్ఓ జిల్లా కమిటీ పిలుపు నిచ్చింది.

ఉపాధి నిధుల స్వాహా..!

● ఇద్దరు అధికారుల సస్పెన్షన్

రాయచూరు, ఫిబ్రవరి 20(ఆంధ్రజ్యోతి) : మహాత్మగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధిహామీ పథకంలో నిధుల దుర్వినియోగానికి పాల్పడిన ఆరోపణలతో ఇద్దరు వ్యవసాయ శాఖ అధికారులు సస్పెండ్ అయ్యారు. వ్యవసాయ శాఖ సహాయ సంచాలకురాలు నాగరత్న, అధికారి సిద్దప్పలను సస్పెన్షన్ చేస్తూ వ్యవసాయ శాఖ రాష్ట్ర అధీన కార్యదర్శి ఏసీ ఇంద్ర గురువారం ఉత్తర్వులు జారీ చేశారు. 2024-25 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి ఆనెహోసూరు గ్రామ పంచాయతీ పరిధిలోని పలు గ్రామాల్లో పెద్ద ఎత్తున నిధుల దుర్వినియోగం జరిగినట్లు ఆరోపణలు వెల్లువెత్తగా అధికారులు దీని పై క్షేత్రస్థాయి విచారణ ప్రారంభించారు. పనులు జరగకుండానే బిల్లులు మంజూరు చేసినట్లు నిర్ధారణ అయింది. దీనిని పరిగణనలోకి తీసుకున్న అధికారులు అవినీతి జరిగినట్లు నిర్ధారించి ఉన్నతాధికారులను నివేదిక ఇవ్వడంతో నివేదిక ఆధారంగా రాష్ట్ర కార్యదర్శి వారిద్దరి పై సస్పెన్షన్ వేటు విధించారు.

సర్వజ్ఞ త్రిపాది వచనాలు ఆదర్శం

● శరణ సాహిత్య పరిషత్ జిల్లా అధ్యక్షుడు సిద్దలింగప్ప



సమావేశంలో మాట్లాడుతున్న సిద్దలింగప్ప

బళ్లారి సిటీ, ఫిబ్రవరి 20(ఆంధ్రజ్యోతి): సర్వజ్ఞ త్రిపాది వచనాలు మన జీవితాలకు మార్గదర్శకాలని వారు ఐక్యత ఏకాభిప్రాయం, సంఘీభావంతో కలిసి జీవించడం నేర్పించారని జిల్లా శరణ సాహిత్య పరిషత్ అధ్యక్షుడు సిద్దలింగప్ప తెలిపారు. గురువారం నగరంలోని డాక్టర్ జోళదరాశి దొడ్డనగౌడ రంగమందిరంలో జిల్లా యంత్రాంగం, జిల్లాపంచాయితీ, సాంస్కృతికశాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన సంతకవి సర్వజ్ఞ జయంతి కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించి మాట్లాడారు. సర్వజ్ఞ హావేరి జిల్లాలోని హిరేకెరూర్ తాలూకాలోని అంబలూర్ గ్రామంలో ఒక కుమ్మరి కుటుంబంలో జన్మించారాన్నరు. ఇది ఇప్పుడు సర్వజ్ఞుని ప్రదేశంగా ప్రసిద్ధి చెందిందన్నారు. సర్వజ్ఞుని త్రిపాదిలు వాటి సరళత, ప్రాసకు ప్రసిద్ధి చెందాయి. ఈ త్రిపాదికలు ప్రధానంగా నైతిక, సామాజిక,మతపరమైన అంశాల గురించి ఉంటాయి. సర్వజ్ఞుని పేరిట సుమారు 1000 తిపాదులు నమోదు చేయబడ్డాయని ఆయన అన్నారు. మేయర్ ముల్లంగి నందీశ్ మాట్లాడుతూ అందరి నుంచి నేర్చుకున్న తర్వాతే సర్వజ్ఞుడైన కవి గొప్ప కవి అయ్యాడన్నారు. 16వ శతాబ్దపు వచన యుగానికి చెందిన త్రిపాదబ్రహ్మ సాధువు అని అన్నారు. ఈసందర్భంగా మున్సిపల్ కార్పోరేషన్ సభ్యులు గోవిందరాజులు, కన్నడ సాంస్కృతికశాఖ అసిస్టెంట్ డైరెక్టర్ నాగరాజు, కొట్రేశ్, శాలివాహన కుమ్మరుల సంఘం అధ్యక్షుడు రంగస్వామి, సంఘం నాయకులు,ప్రజాప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు. నగరంలోని రాజ్‌కుమార్ రోడ్డులోని మున్సిపల్ కళాశాల మైదానం నుంచి ప్రారంభమైన ఊరేగింపు గడిగిచెన్నప్ప సర్కిల్, రైల్వేస్టేషన్‌రోడ్డు,గవియప్ప సర్కిల్ మీదుగా వేదిక కార్యక్రమం నిర్వహించు జోళదరాశి దొడ్డరంగమందిరం వరకు సాగింది.

రక్తదానంపై అపోహలు వీడాలి

● ఆరోగ్యవంతులు ధైర్యంగా ముందుకు రావాలి
● జిందాల్‌లో మెగా రక్తదాన శిబిరాన్ని ప్రారంభించిన కలెక్టర్



కార్యక్రమంలో మాట్లాడుతున్న కలెక్టర్ ప్రశాంత్‌కుమార్ మిశ్రా

బళ్లారి సిటీ, ఫిబ్రవరి20(ఆంధ్రజ్యోతి): రక్తదానంపై అపోహలు వీడాలని, ఆరోగ్యవంతులు రక్తదానానికి ముందుకు రావాలని కలెక్టర్ ప్రశాంత్ కుమార్ మిశ్రా పిలుపునిచ్చారు. గురువారం సండూర్‌లోని తోరణగల్లు సమీపంలోని జిందాల్‌లో ఓపిజే సెంటర్ ఆడిటోరియంలో మూడు రోజుల భారీ రక్తదాన శిబిరాన్ని ఆయన ప్రారంభించి మాట్లాడారు. కృత్రిమంగా ఉత్పత్తి చేయలేని రక్తదానం ద్వారా ఒక ప్రాణాన్ని కాపాడటం నిజంగా ఒక గొప్ప కార్యమన్నారు. 18ఏళ్లు నిండిన అర్హులందరూ తప్పకుండా రక్తదానం చేయాలన్నారు. జిల్లాలో రక్తదాన శిబిరాలు తగ్గిపోవడం బాధాకరమన్నారు. ఈ సంవత్సరం రక్త సేకరణ మరింత తక్కువగా ఉందన్నారు. దీనిని ప్రోత్సహించడానికి జిల్లా ఆరోగ్య, కుటుంబ సంక్షేమ శాఖ, జిల్లా ఎయిడ్స్ నియంత్రణ యూనిట్ సహకారంతో జిందాల్ క్యాంపస్‌లోని 15వేర్వేరు ప్రదేశాలలో రక్త బ్యాంకుల ద్వారా భారీ రక్తదాన శిబిరాన్ని నిర్వహిస్తున్నాట్లు తెలిపారు. అత్యవసర పరిస్థితుల్లో ప్రాణాలను కాపాడేందుకు, కర్తకొరతను తగ్గించడానికి ఫ్రిబవరి 22వరకు రక్తదానం శిబిరం నిర్వహించబడుతుందన్నారు. ఈశిబిరంలో ప్రతి ఒక్కరూ పాల్గొని రక్తదానం చేయవచ్చన్నారు. జిల్లా ఎయిడ్స్ నియంత్రణ నిర్వహణ యూనిట్ డాక్టర్ ఇంద్రాణి మాట్లాడుతూ.. మన అవయవాలన్నింటిని దానం చేయవచ్చు, వీటిలో కర్తదానం చాలా ముఖ్యమైనదన్నారు. జిల్లాలోని బిమ్స్ ఆసుపత్రి జిల్లా ఆసుపత్రి ఇతర రక్త కేంద్రాలలో రక్తం అవసరం చాలా ఉందని అన్నారు. ఈసందర్భంగా జిల్లాపోలీస్ సూపరింటెండెంట్ శోభారాణి, జిల్లా ఆరోగ్య కుటుంబ సంక్షేమ శాఖ రమేశ్‌బాబు, జిల్లా సర్జన్ డా. బసారెడ్డి, జిందాల్ తోరణగల్లు ఎగ్జిక్యూటివ్ వైస్ ప్రెసిడెంట్ మయూరేశ్ బాపట్, సునీల్ రాల్ఫ్, పెద్దన్న, సంజీవిని హాస్పిటల్ డా. సునీల్ తదితరులు పాల్గొన్నారు.

చట్టం ముందు అందరూ సమానమే

● జిల్లా న్యాయాధికారి రాజేశ్ హొసమనె




మాట్లాడుతున్న న్యాయాధికారి రాజేశ్ హొసమనె

బళ్లారి గాంధీనగర్/సిటీ, ఫిబ్రవరి 20(ఆంధ్రజ్యోతి): చట్టం పట్ల అందరూ సమానమనే భావన అందరిలోనూ రావాలని అపుడే సామాజిక న్యాయం లభిస్తుందని, జిల్లా చట్ట సేవా ప్రాధికార మెంబర్ సెక్రటరీ, సివిల్ న్యాయాధికారి రాజేష్ ఎన్.హొసమని పేర్కొన్నారు. జిల్లా పాలనా మండలి, జిల్లా పంచాయతీ, జిల్లా చట్ట సేవా ప్రాధికర, సాంఘీక సంక్షేమ శాఖ సంయుక్త ఆధ్వర్యంలో నగరంలోని ప్రభుత్వ మెట్రిక్ నంతర బాలకుల విద్యార్థి నిలయం నెం-2 ఆవరణలో ఏర్పాటుచేసిన ప్రపంచ సామాజిక న్యాయ దినోత్సవం కార్యక్రమానికి ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. సమాన, స్వాతంత్ర్యం ఈ రెండు దేశంలో చిట్టచివరి వ్యక్తికి లభించినపుడే నిజమైన సామాజిక సమానత లభించినట్లు అవుతుందన్నారు. అసమానతను తొలగించాలంటే సమానత సక్రమంగా పంపిణీ కావాలన్నారు. బాబా సాహెంబ్ డాక్టర్ బి.ఆర్.అంబేద్కర్ జాతి నిందన, అవమానాలు సహించి కేవలం విద్యార్జన ద్వారానే సామంజలో మార్పు తీసుకు రావడానికి సాధ్యమవుతుందని నమ్మారన్నారు. ప్రస్తుతం ప్రపంచంలో పేద, శ్రీమంత అనే రెండు జాతులు ఉన్నాయి, జ్ఞానార్జన ద్వారా ఆర్థికంగా సబలత చేకూరాలన్నారు. ఈ సందర్భంగా ట్రాఫిక్ పోలీసు ఇన్‌స్పెక్టర్ అయ్యనగౌడ పాటీల్, సాంఘీక సంక్షేమ శాఖ అసిస్టెంట్ డైరెక్టర్ మల్లికార్జున, అసిస్టెంట్ డైరెక్టర్ మమత, వార్డన్ శివప్ప, సరళాదేవి కళాశాల ఉపన్యాసకులు మల్లనగౌడ, విజయ కుమార్‌తోపాటు విద్యార్థుల, హాస్టల్ సిబ్బంది పాల్గొన్నారు. విద్యార్థులకు అందించే ఆహారం, గ్రంథాలయం, వంటగదిని ఆయన పరిశీలించారు.

తుంగభద్రలో గల్లంతైన వైద్యురాలి మృతదేహం లభ్యం

బళ్లారి గాంధీనగర్, ఫిబ్రవరి 20(ఆంధ్రజ్యోతి): గంగావతి తాలూకా సణాపుర గ్రామం వద్ద తుంగభద్ర నదిలో ఈతకని వెళ్ళి నదిలో కొట్టుకుని పోయిన హైదరాబాద్‌కు చెందిన ప్రైవేట్ ఆసుపత్రి వైద్యురాలు అనన్య రావు(26) మృత దేహాన్ని ఎట్టకేలకు గురువారం రక్షణ సిబ్బంది గుర్తించారు. అగ్నిమాపక, పోలీసు శాఖ, జెఎస్‌డబ్ల్యూ సంస్థకు చెందిన రెస్క్యూ టీమ్ స్థానికుల తెప్పలు వేసే యువకులు నిరంతరంగా ఒక రోజు పాటు కార్యచరణ చేసిన అనంతరం బుధవారం సాయంత్రం అనన్యరావ్ శవాన్ని కనుగొన్నారు. హైదరాబాద్ సమీపంలోని నాంపల్లికి చెందిన అనన్యరావ్ సెలవు రోజులను తన స్నేహితులతో గడపడానికి గంగావతిలోని సణాపురం గ్రామానికి గెస్ట్ హౌస్‌లో బసచేశారు. బుధవారం ఉదయం గెస్ట్ హౌస్ వెనుక భాగంలో ఉన్న తుంగభద్ర నదిలో స్నేహితులతో ఈ కొట్టడానికి వెళ్ళిన సమయంలో ఈ ఘటన చోటు చేసుకుంది. అనన్యరావ్ తెలంగాణకు చెందిన ఓ ప్రముఖ రాజకీయ నాయకుడి కుమార్తెగా తెలిసింది. నదిలో నీటి ప్రమాణం ప్రవాహాన్ని తగ్గించి కార్యాచరణ జరపడంతో బండరాళ్ళ మధ్య అనన్యరావ్ మృతదేహాన్ని రక్షణ సిబ్బంది కనుగొన్నారు. మృతదేహం బయటకు తీస్తుండగానే వైద్యులు, కుటుంబ సభ్యుల రోధనలు మిన్నంటాయి. అనంతరం నదీతీరంలోనే అనన్యరావ్‌కు వైద్యులు శవపరీక్షలు నిర్వహించిన అనంతరం మృతదేహాన్ని కుటుంబ సభ్యులకు అందజేశారు. స్థానికుల సహాయంతో మృతదేహాన్ని హైదరాబాద్‌కు తీసుకెళ్ళారు.



మృతదేహాన్ని వెలికి తీస్తున్న స్థానికులు, అనన్యరావు (ఫైల్)



మాట్లాడుతున్న మేయర్ ముల్లంగి నందీశ్

చరిత్రలో ఛత్రపతి పాలన ప్రత్యేకం: మేయర్

బళ్లారి సిటీ, ఫిబ్రవరి 20(ఆంధ్రజ్యోతి): చరిత్రలో ఛత్రపతి శివాజీ పాలన ఎంతో ప్రత్యేకమైనదని, పరిపాలనా నైపుణ్యాలు స్వరాజ్య విలువలను, మరాఠా వారసత్వానికి ఆయన చెరగని ముద్ర వేశారని మహానగర పాలికే మేయర్ ముల్లంగి నందీశ్ అన్నారు. జిల్లా యంత్రాంగం, జిల్లా పంచాయతీ, కన్నడ సాంస్కృతికశాఖ, మున్సిపల్ కార్పోరేషన్ సంయుక్త ఆధ్వర్యంలో నగరంలోని జోళదరాశి దొడ్డనగౌడ రంగమందిరంలో బుధవారం సాయంత్రం నిర్వహించిన ఛత్రపతి శివాజీ మహారాజ్ జయంతి కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించి మాట్లాడారు. మరాఠా సైన్యం ద్వారా గెరిల్లా యుద్ధ పద్ధతులను ప్రవేశపెట్టిన మొదటి వ్యక్తి శివాజీ మహారాజ్ అని, అతని ధైర్యం వ్యూహాలకు ప్రసిద్ధి చెందిందన్నారు. మొఘలులపై అనేక యుద్ధాలను గెలిచిన మహా వీరుడన్నారు.

కర్ణాటక మరాఠా ఛత్రపతి శివాజీ మహారాజసేన యువజన రాష్ట్ర అధ్యక్షుడు వినోద్ చవాన్ మాట్లాడుతూ ఛత్రపతి శివాజీ మహారాజ్ బాల్యం, ధైర్యం, క్షేత్రవైభవం, ఆత్మగౌరవం,స్వరాజ్య భావన, దేశభక్తి యొక్క ఆదర్శాలను అణగారిన సమాజంలోని యువత అలవర్చుకోవాలన్నారు. ఈసందర్భంగా ఛత్రపతి శివాజీ మహారాజ్ పాలన, నాయకత్వం, మరాఠా యోధుల త్యాగం గురించి మహారాజు విరోచిత గాధను అవిష్కరించారు. కార్యక్రమంలో మాజీ సైనికులను సత్కరించారు. ఇటీవల మైసూరు విశ్వవిద్యాలయం నుండి 16బంగారు పతకాలు గెలుచుకున్న పూజా నలవాడేను గౌరవ పురస్కారంతో సత్కరించారు. శివాజీ జయంతిని పురస్కరించుకుని నగరంలో భారీ ఊరేగింపు నిర్వహించారు. ఉదయం నగరంలోని పాండురంగస్వామి ఆలయంలో వివిధ ధార్మిక కార్యక్రమాలు జరిగాయి. సాయంత్రం నగరంలోని సంగీత బృందాలతో గొప్ప ఊరేగింపు జరిగింది. ఈసందర్భంగా కన్నడ సాంస్కృతికశాఖ అసిస్టెంట్ డైరెక్టర్ నాగరాజ్, హిందూ మత వ్యవహారాల శాఖ అధికారి ప్రకాశ్ రావు, జిల్లా ప్రభుత్వ ఉద్యోగుల సంఘం మాజీ అధ్యక్షుడు శివాజీ రావు, మరాఠా సంఘం నాయకులు తదితరులు పాల్గొన్నారు.

తల్లిదండ్రులకు పాదపూజ



పాదపూజ చేస్తున్న విద్యార్థులు

బళ్లారిరూరల్, ఫిబ్రవరి 20 (ఆంధ్రజ్యోతి) : బళ్లారి రూరల్ పరిధిలోని పీడీ హళ్లి గ్రామంలో శ్రీ జటింగి రామేశ్వర హిరియ ప్రాథమిక పాఠశాలలో గురువారం తల్లిదండ్రులకు పాదపూజ, సరస్వతీ పూజ నిర్వహించారు. ఈ సందర్భంగా కరెస్పాండెంట్ చంద్రమూర్తి మాట్లాడుతూ విద్యార్థులు తల్లి దండ్రులను గౌరవించడంపై అవగాహన కల్పించేందుకే కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో హెచ్‌ఎం నాయక్, ఉపాధ్యాయులు రాజన్న, స్కూలు ఉపాధాయయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

వాల్మీకులు అన్ని రంగాల్లో రాణించాలి

● కార్యాలయ ప్రారంభోత్సవంలో రాష్ట్ర అధ్యక్షుడు జోళదరాసి తిమ్మప్ప



మొక్కకు నీరు పోసి కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న నాయకులు

బళ్లారిరూరల్, ఫిబ్రవరి 20(ఆంధ్రజ్యోతి): వాల్మీకులు అన్నిరంగాల్లో రాణించాలని అఖండ కర్ణాటక వాల్మీకి నాయకులు రాష్ట్ర అధ్యక్షుడు జోళదరాసి తిమ్మప్ప పిలుపునిచ్చారు. బుధవారం నగరంలో మోకా రోడ్డు గాంధీనగర్, ఎన్ వై కాంప్లెక్స్ ఆధ్వర్యంలో నూతన కార్యాలయాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వాల్మీకి సమాజ ప్రగతికి అందరం కలిసికట్టుగా పనిచేద్దామన్నారు. వాల్మీకి విద్యార్థుల పట్ల విద్యా సామాజిక రంగానికి కార్యాచరణ రూపొందించాలన్నారు. వెనుకబడిన వాల్మీకి సమాజాన్ని మేల్కొల్పడం విద్యాభివృద్ధికి, సమాజానికి వాల్మీకి పేద విద్యార్థుల ప్రోత్సాహంతో పాటు అండగా వుంటూ మనం కలసికట్టుగా సక్రమంగా ఐక్యతతో పనిచేద్దామని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో వాల్మీకి సంఘ నాయకులు కార్పొరేటర్ హనుమంతు, పీడీ హళ్లి జనార్దన్ నాయక్, విజయ్ కుమార్, గుమ్మనూరు జగన్, రూపనగుడి గోవిందు, అడ్వకేట్ గవిసిద్ధప్ప, రూపనగుడి వెంకటేష్, చంద్రశేఖర్, సత్యనారాయణ, ఎర్రగుడి గోపాల్, సింధిగేరి గోవిందప్ప నాయక్, శివానంద కిష్టప్ప, ఎర్రగుడి రమేష్, వీరాపురం తిప్పేస్వామి, మోకా మల్లయ్య, వాల్మీకుల బంధువులు తదితరులు పాల్గొన్నారు.

పొలాల్లో ఎలక్ట్రానిక్ మైక్‌ల ఏర్పాటు



పొలంలో ఏర్పాటు చేసిన మైక్‌లు

కంప్లి, ఫిబ్రవరి 20(ఆంధ్ర జ్యోతి): రైతులు కష్టపడి పంటలు పండించిన అనంతరం పశుపక్షాదుల బెడదతో పూర్తిగా నష్టపోతున్నారు. వాటి నుండి విముక్తి పొందేందుకు పొలాల్లో శబ్దాలు వచ్చే పరికరాలను ఇతర వాటిని ఏర్పాటు చేసుకుని పంటలను రక్షించుకుంటారు. కూడ్లిగి తాలుకాలో వేసుకున్న పంటలు రక్షించేందుకు జంగమ సువెనహళ్లి రైతు నాగరాజు గౌడ తాను వేసుకున్న పంటలకు అడవి పందులు, పక్షులు తదితర వాటివి రాకుండా ఎలక్ట్రానిక్ మైకులు ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా నాగరాజు మాట్లాడుతూ వేసుకున్న పంటలు ఆహారం లేక అడవిపందులు, కుందేళ్లు, ఎలుగుబంట్లు, పక్షులు కొండ ప్రాంతాల్లో వుండే పొలాలపై చేరి ధ్వంసం చేస్తాయి. పగటి పూట కూలీలు అందుబాటులో వుండటంతో శబ్దాలు చేస్తారు. కానీ రాత్రి వేళల్లో జంతువుల భయంతో పొలాల్లోకి వచ్చేందుకు జంకుతున్నారు. దీంతో వ్యవసాయాధికారులతో చర్చలు జరిపి వారిచ్చిన ఆదేశాల మేరకు సోలార్ మైకులను ఏర్పాటు చేసి పగలు, రాత్రి శబ్దాలు వచ్చేలా ఏర్పాటు చేశారు. ఈ మైకు ఒకదానికి రూ.ఆరు వేలు నుంచి రూ.పది వేలు వరకు ఖర్చవుతోంది. పొలాలకు ఇబ్బంది కలుగకుండా రక్షణగా వున్నాయన్నారు.

24న కొప్పళ బంద్‌కు సిద్దేశ్వర మహాస్వామి పిలుపు

గంగావతి రూరల్, ఫిబ్రవరి 20(ఆంధ్రజ్యోతి): కొప్పళ జిల్లాలో ఎంఎస్‌పీఎల్ ఉక్కు కర్మాగారం నిర్మించేందుకు ప్రభుత్వ అనుమతి ఇవ్వడాన్ని నిరసిస్తూ ఈ నెల 24న జిల్లా బంద్‌కు గౌసిద్దేశ్వర మహాస్వామి బంద్ కు పిలుపునిచ్చారు. గురువారం ఆయన పట్టణంలో మాట్లాడుతూ.. ఇక్కడి ప్రజలు, అధికారులు, సంఘ సంస్థలు రాజకీయ నాయకులు మాకు ఉక్కు కర్మాగారం వద్దు దీని ద్వారా నష్టపోతారన్నారు. ఈసందర్భంగా కొప్పళ ఎమ్మెల్యే రాఘవేంద్ర ఇట్నాల్, కొప్పళ ఎంపీ రాజశేఖర్ ఇట్నాల్ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న సిద్దేశ్వర మహాస్వామి

హోసూరు జోన్



ఊరేగింపులో పాల్గొన్న జనసేన, శివసేన సంఘాల నాయకులు

ఘనంగా ఛత్రపతి శివాజీ జయంతి

హోసూరు, ఫిబ్రవరి 20(ఆంధ్రజ్యోతి): హోసూరులో ఛత్రపతి శివాజీ 395వ జయంతిని ఘనంగా నిర్వహించారు. ఛత్రపతి శివాజీ మహారాజ్ విగ్రహాన్ని పురవీధులలో ఊరేగించారు. హోసూరు కామరాజ కాలనీలో హిందూ జనసేన, శివసేన ఆధ్వర్యంలో హిందూ జాగృతి బహిరంగ సభ జరిగింది. అంతకుముందు యువసేన రాష్ట్ర కార్యదర్శి శివకుమార్ ఛత్రపతి శివాజీ విగ్రహాన్ని వీపుపై ఉంచి వాహనాన్ని లాగారు. పెద్ద సంఖ్యలో వలంటీర్లు ఆయనతో ఉత్సాహంగా పాల్గొన్నారు. వేదికపై ఛత్రపతి శివాజీ విగ్రహాన్ని ఉంచి పూలతో అభిషేకం చేశారు. తర్వాత జరిగిన హిందూ జాగృతి ర్యాలీలో ఆర్ఎస్ఎస్‌కు చెందిన బెంగళూరు రంగరాజన్, హిందూ జనసేన అధ్యక్షుడు, శివసేన రాష్ట్ర సంస్థ కార్యదర్శి మురళీమోహన్ సహ పలువురు ప్రసంగించారు. కార్యక్రమంలో శివసేన, జనసేన, యువసేన సంస్థల నుంచి కార్యకర్తలు, అభిమానులు, ప్రజలు పాల్గొన్నారు.



బియ్యం నిల్వపై అధికారులతో ఆరాతీస్తున్న కలెక్టర్ దినేశ్‌కుమార్

గోడౌన్‌లను తనిఖీ చేసిన కలెక్టర్

హోసూరు(కృష్ణగిరి) ఫిబ్రవరి 20(ఆంధ్రజ్యోతి): కృష్ణగిరి జిల్లాలోని తమిళనాడు కన్స్యూమర్ గూడ్స్ ట్రేడింగ్ కార్పొరేషన్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న కృష్ణగిరి రౌండ్ ప్రాసెసింగ్ గోదాములో ప్రజాపంపిణీ పథకానికి నిల్వ ఉంచిన ఆహార పదార్థాలను జిల్లా కలెక్టర్ దినేశ్‌కుమార్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. ప్రైవేట్ మిల్లింగ్ ఏజెంట్ మిల్లుల నుంచి పొందిన బాయిల్డ్ రైస్‌ను పరిశీలించారు. పంపిణీ పథకం కోసం నిల్వ చేసినట్టు మిల్లు యాజమానులు తెలిపారు. తనిఖీవేళ స్టాక్‌లో ఉన్న 12 మెట్రిక్ టన్నుల బియ్యం వాణిజ్య నాణ్యత లేని కారణంగా, మిల్లింగ్ ఏజెంట్ దానిని సంబంధిత మిల్లుకు వాపసు పంపి నాణ్యమైనవి సమర్పించాలని సూచించారు. కలెక్టర్ ఆదేశాల మేరకు 12 మెట్రిక్ టన్నుల బియ్యాన్ని ప్రైవేట్ ఏజెంట్ మిల్లుకు తిప్పి పంపించారు. తనిఖీలో జిల్లా రెవెన్యూ అధికారి సాధనకురళ్, జిల్లా సరఫరా అధికారిణి గీతారాణి, తమిళనాడు వినియోగ వస్తువుల ట్రేడ్ కార్పొరేషన్ రీజనల్ మేనేజర్ శక్తి డిప్యూటీ మేనేజర్ బాలమురుగన్, వళర్మతి తదితర ప్రభుత్వ అధికారులు పాల్గొన్నారు.

మురుగు కాలువల కోసం పోరుబాట

హోసూరు ఫిబ్రవరి 20(ఆంధ్రజ్యోతి): కృష్ణగిరి, శూలగిరి యూనియన్ మాదర్శనపల్లి గ్రామంలో ఎన్నో ఏళ్లుగా మురుగు కాల్వలు నిర్మించకపోవడంతో మురుగునీరు రోడ్డుపై ప్రవహిస్తూ దుర్గంధంతో ఇబ్బంది పడుతున్న గ్రామస్థులు విచారం వ్యక్తం చేశారు. ఇకనైనా మురుగు కాలువలు నిర్మించాలని డిమాండ్ చేశారు. రోడ్డుపై మురుగునీరు ప్రవహిస్తుండడంతో రోగాలు ప్రబలే అవకాశం ఉందన్నారు. గ్రామస్థులు శూలగిరి వాసులు జిల్లా అభివృద్ధి కార్యాలయం ముందు గురువారం నిరసన చేశారు. సమాచారం శూలగిరి ఇన్‌స్పెక్టర్ సూల్తాన్ స్పందించి నిరసన వీడాలని, వినతిపై సంబంధిత అధికారులతో చర్చించి పరిష్కరించేందుకు కృషి చేస్తామని హామీ ఇచ్చారు. దీంతో గ్రామస్తులు నిరసన వీడారు. న్యాయవాది సుందరమూర్తి తదితరులు పాల్గొన్నారు. నిరసనకు బీజేపీ స్థానిక నాయకుడు షణ్ముగం అధ్యక్షత వహించారు.



నిరసనలో పాల్గొన్న గ్రామస్థులు